జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 07, ఆగస్టు 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
# నోటిఫికేషన్ విడుదల

అమరావతి, మహానాడు:
విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 13 వరకు నామి నేషన్ల స్వీకరణ, 30న పోలింగ్, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది. జీవీఎంసీ కార్పొరేటర్లు, యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు ఓటు హక్కు విని యోగించుకుంటారు.



మొత్తం 838 ఓట్లు ఉండగా, వైసీపీకి 615, కూటమికి 215 ఓట్లు ఉన్నాయి. వైసీపీ అభ్యర్థిగా బొత్సను ఎంపిక చేయగా, కూటమి ఇంకా పేరు ఖరారు చేయలేదు.



# ఉత్తరాన 'ఫ్యాను' ఉక్కిరిబిక్కిరి!



- ప్రతిష్ఠగా మారిన ఎమ్మెల్సీ ఎన్నిక
- బొత్స గెలిస్తేనే పార్టీ పరువు నిలిచేది
- టీడీపీ అభ్యర్థిగా పీలా గోవిందు
- ఇప్పటికే టీడీపీ, జనసేనలోకి వైసీపీ కార్పొరేటర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు
- దాదాపు 60 మంది జంపవుతున్న దయనీయం
- అమరావతిలో టీడీపీ శిబిరానికి వైసీపీ ప్రజాప్రతినిధులు
- వైసీపీ ప్రతినిధులకు టీడీపీ భరోసా
- సీటు దక్కని అమర్నాథ్ అసంతృప్తి
- బొత్స ఇమేజ్‌పైనే వైసీపీ విజయం

(మార్తి సుబ్రహ్మణ్యం)
అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత.. ఏపీలో జరుగుతున్న తొలి శాసనమండలి ఎన్నిక వైసీపీ అధినేత–మాజీ సీఎం జగన్‌రెడ్డి ఇమేజ్‌కి సవాలుగా మారింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి జరగనున్న ఎన్నికలో వైసీపీ అభ్యర్థిగా మాజీ మంంత్రి, సీనియర్ నేత బొత్స సత్యనారాయణను ఆ పార్టీ రంగంలోకి దింపటంతో ఎన్నిక ఆసక్తికరంగా మారింది. మిగతా.. 2లో

## నదుల అనుసంధానంతో
# కరువు అరికట్టవచ్చు

- అన్ని రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ చెరువులను పూర్తిగా నీటితో నింపాలి
- పోలవరం ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్ళాలి
- డయాఫ్రం వాల్ ను రెండు సీజన్లలో పూర్తి చేసి వచ్చే జూన్ నాటికి సిద్ధం చేయాలి
- నీటి వృధాను అరికట్టు చివరి ఎకరాకు సైతం సాగు నీరు అందించాలి
- వెలుగొండ, చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1 త్వరగా పూర్తి చేయాలి
- జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, మహానాడు:
ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వస్తున్న వరద నీటిని వినియోగించుకుని రాష్ట్రంలోని అన్ని ప్రధాన రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ చెరువులను పూర్తిగా నీటితో నింపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జల వనరులు శాఖ అధికారులను ఆదేశించారు. నీటి వృథాను అరికట్టి ఆయకట్టులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూడాలని స్పష్టం చేశారు. కరవు పరిస్థితులను సైతం అధికమించేందుకు వీలుగా అన్ని రిజర్వాయర్లను, మైనర్ ఇరిగేషన్ చెరువులను నీటితో నింపాలన్నారు. జలవనరుల శాఖపై మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులతో సమీక్షించారు.

రాష్ట్రంలో ప్రస్తుతం వివిధ ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఉన్న నీటి లభ్యత, తదితర అంశాలపై జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ రిజర్వాయర్లు, ఇతర ప్రాజెక్టులకు ఎంత నీరు వచ్చి చేరింది, పూర్తి స్థాయిలో నిండక పోవడానికి గల కారణాలను క్షేత్ర స్థాయి నుండి విశ్లేషించుకోవాలని అధికారులకు సూచించారు. మిగతా.. 2లో


## వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన అన్ని
# ప్రాజెక్టులు మళ్లీ పట్టాలెక్కాలి




- సీఎం నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, మహానాడు:
2014-19 మధ్య కాలంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం అనేక ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ప్రారంభిస్తే.... వాటన్నింటినీ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం మిగతా.. 2లో

# 22 గేట్ల ద్వారా సాగర్ నీరు విడుదల



మాచర్ల, మహానాడు:
నాగార్జున సాగర్ 22 క్రస్ట్ గేట్ల ద్వారా 3 లక్షల 41 వేల 990 క్యూసెక్కుల నీటిని అధికారులు మంగళవారం విడుదల చేశారు. 2 క్రస్ట్ గేట్ల ద్వారా 5 అడుగుల నీరు 20 క్రస్ట్ గేట్ల ద్వారా 10 మేర నీటిని విడుదల చేశారు. కాగా, 3 లక్ష 41 వేల 990 క్యూసెక్కుల నీరు వచ్చి నాగార్జున సాగర్‌కు చేరుతోంది. మిగతా.. 2లో



## శ్రీవారి దర్శన
# టికెట్లలో గోల్‌మాల్

- 14,449 అనుమానిత శ్రీవాణి టికెట్ల లావాదేవీలు
- శ్రీవాణి టికెట్లలో గోల్ మాల్
- 225 శ్రీవాణి టికెట్లపైనా టీటీడీ దృష్టి

తిరుమల,మహానాడు:
కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడి దర్శనానికి నిత్యం వేలాది మంది తరలివస్తుంటారు. వివిధ రకాల సేవలు, దర్శనాల ద్వారా శ్రీవారిని దర్శించుకుంటూ ఉంటారు. అయితే తాజాగా తిరుమల శ్రీవారి దర్శన టికెట్లలో గోల్ మాల్ వ్యవహారం బయటపడింది.

శ్రీవాణి టికెట్లలో కొంతమంది గోల్ మాల్ చేసినట్లు టీటీడీ గుర్తించింది. 545 మంది యూజర్ల ద్వారా.. దాదాపుగా 14,449 అనుమానిత శ్రీవాణి టికెట్ల లావాదేవీలు మిగతా.. 2లో

## అసాంఘిక శక్తులపై
# ఉక్కుపాదం

- నేర సమీక్షా సమావేశం డీజీపీ జితేందర్

విజయవాడ, మహానాడు:
రాష్ట్రంలో నేరాలను నియంత్రించడానికి, నేర ధోరణులను విశ్లేషించడానికి, ప్రజల భద్రత పెంచడానికి, చట్టాల అమలును మెరుగుపరచడానికి అవసరమైన చర్యలపై డిజిపి డాక్టర్ జితేందర్ అధ్యక్షతన మంగళవారం నాడు డిజిపి



కార్యాలయంలో సమగ్ర అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల సీపీలు, జోన్ల ఐజీలు, రేంజ్ డీఐజీలు, స్టాఫ్ అధికారులు హాజరయ్యారు. సమావేశంలో డిజిపి మాట్లాడుతూ, నివారణాత్మక పోలీసింగ్‌పై మిగతా.. 2లో

# షాద్‌నగర్ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, మహానాడు:
షాద్ నగర్ పట్టణ పోలీసులు ఒక చోరీ కేసులో దళిత మహిళను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి శిక్షించిన.. అంశంపై అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం స్పందించారు. కేసు పూర్వపరాలు తెలుసుకొని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, దళిత కుటుంబానికి మిగతా.. 2లో





## హైదరాబాద్‌లో ట్రైజిన్
# ఏఐ ఇన్నోవేషన్ సెంటర్

- ఆరు నెలల్లో కార్యకలాపాల ప్రారంభం
- వెయ్యి మందికిపైగా ఉద్యోగాలు, శిక్షణ

హైదరాబాద్, మహానాడు:
ట్రైజిన్ టెక్నాలజీస్ కంపెనీ హైదరాబాద్‌లో తమ అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సెంటర్ నెలకొల్పనుంది. అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర మిగతా.. 2లో



జనసేనలోకి విశాఖ వైసీపీ కార్పొరేటర్లు
3లో



అక్రమ కేసులు.. హత్యలపైనే అధిక ఫిర్యాదులు
4లో



శ్రీ కనక పుట్లమ్మ తల్లి చల్లని చూపుతో మంగళగిరికి మంచి రోజులు
9లో



హసీనా ప్రభుత్వం కూల్చివేత వెనుక ఎవరున్నారు?
8లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 07, ఆగస్టు 2024

## ఉత్తరాన 'ఫ్యాను' ఉక్కిరిబిక్కిరి!

(మొదటిపేజీ తరువాయి..)

బొత్స మంత్రిగా ఉండగా, ఆయన పలుకుబడిని నిర్వీర్యం చేసి, మేనల్లుడు శ్రీనును ప్రోత్సహించిన జగన్‌కు ఇప్పుడు మళ్లీ సత్తిబాబే దిక్కయ్యారు. జగన్ సీఎంగా ఉండగా బొత్సను పక్కనపెట్టి ఆయన మేనల్లుడు శ్రీనును జగన్ ప్రోత్సహించారు. మంత్రి అమర్‌నాథ్, మేనల్లుడు శ్రీనుకు రెండురోజులకోసారి అపాయింట ్మెంట్ ఇచ్చేవారంటే, బొత్సను ఏ స్థాయిలో అణచివేశారో అర్ధమవుతుంది.

చివరకు ఉత్తరాంధ్రలో పలుకుబడి -ప్రభావం ఉన్న బొత్సను రంగంలోకి దించితే తప్ప, గెలవలేమన్న అభిప్రాయానికి వచ్చిన జగన్.. చివరకు సత్తిబాబునే ఎమ్మెల్సీ ఎన్నిక బరిలోకి దింపటం అనివార్యమయింది. అయితే ఎమ్మెల్సీ అభ్యర్ధిత్వం ఆశించిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాధ్ తన



పార్టీ అధినేత జగన్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

విశాఖపట్నం స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా మోగింది. దీనికి సంబంధించి ఆగస్టు 6న నోటిఫికేషన్ వెలువడవనుండగా, ఆగస్టు 30న ఎన్నిక జరగనుంది. మొత్తం ఓట్లు 841 ఉండగా, అందులో వైసీపీ 615, టీడీపీ-జనసేనకు 215 ఓట్లున్నాయి. ఆ ప్రకారంగా సాంకేతికంగా చూస్తే వైసీపీ విజయం నల్లేరు నడకే.

కానీ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో వైసీపీని బలహీన పరిచేందుకు, కూటమి రంగంలోకి దిగింది. ఆ మేరకు వైసీపీ కార్పొరేటర్లు, భారీ స్థాయిలో టీడీపీ-జనసేనలో చేరుతున్నారు. తాజాగా ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు జనసేన చీఫ్, మంత్రి పవన్ సమక్షంలో జనసేన తీర్థం తీసుకున్నారు. అదే సమయంలో 60 మంది ఎంపీటీసీ, జడ్పీటీసీలు టీడీపీ తీర్థం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.టీడీపీ అభ్యర్ధిగా ఖరారు కానున్న పీలా గోవింద్ గెలవాలంటే మరో 250 మంది సభ్యుల ఓట్లు అవసరం.

టీడీపీలో చేరనున్న 60 మంది స్థానిక సంస్థల ప్రతినిధులను, అమరావతి క్యాంపునకు తరలించేందుకు రంగం సిద్ధమవుయింది. టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస యాదవ్ పర్యవేక్షణలో క్యాంపు రాజకీయాలకు తెరలేచింది.

ఇదిలాఉండగా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీనియర్ నేతలు దాడి వీరభద్రరావు, గంటాశ్రీనివాసరావు తదితరులు ఇప్పటికే వైసీపీ ప్రజాప్రతినిధులతో మంతనాలు సాగిస్తున్నారు. టీడీపీలోకి వస్తే ప్రాధాన్యం ఇస్తామని భరోసా ఇస్తున్నారు. ఎలాగైనా బొత్సను ఓడించడం ద్వారా, జగన్‌కు ఝలక్ ఇవ్వాలన్న గట్టి పట్టుదలతో టీడీపీ సీనియర్లు పనిచేస్తున్నారు.

మరోవైపు బొత్స సైతం తన గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసు కున్నారు. తన ఇమేజ్‌ను ఉపయోగించుకుని, వైసీపీ ప్రజాప్రతి నిధులు జారిపోకుండా వ్యూహాలు రచిస్తున్నారు. ఆ మేరకు ఆయన తన కుటుంబసభ్యులు, మద్దతుదారులను రంగంలోకి దించారు. ఆయన తన కులం కార్డు కూడా వాడేందుకు సిద్ధమవుతున్నారు.

తన పార్టీ సభ్యులను టీడీపీ ఎగరేసుకుపోకుండా ఉండేందుకు, తాను కూడా తన పార్టీ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించి, క్యాంపు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

అయితే ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం.. స్థానిక ప్రజాప్రతినిధులు వైసీపీ వైపే ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ అభ్యర్ధిగా బొత్స కాకుండా మరొకరు ఉంటే, ఫలితం టీడీపీకి ఏకపక్షంగా ఉండేదని.. ఇప్పుడు ఆయన రంగంలోకి దిగడంతో ఎన్నిక ఉత్కంఠంగా మారిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఇదిలా ఉండగా.. అధికారం కోల్పోవడంతో కార్పొరేటర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూటమి వైపు చూస్తున్న పరిస్థితి. తాము టీడీపీలో చేరితే, మరో మూడేళ్లు తమకు రాజకీయంగా ఎలాంటి ఢోకా ఉండదన్న ముందుచూపు, వారిని టీడీపీ వైపు అడుగులు వేయిస్తున్నాయి.

కాగా.. ఎమ్మెల్సీ అభ్యర్ధిత్వం ఆశించిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాధ్.. తన పార్టీ అధినేత జగన్ నిర్ణయంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కూటమిలో చేరగా మిగిలిన ఆయన వర్గానికి చెందిన వైసీపీ కార్పొరేటర్లు, ఎంపీటీసీ-జడ్పీటీసీ సభ్యులు వైసీపీ అభ్యర్ధి బొత్సకు ఏమేరకు సహకరిస్తారోనన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది.

## జయశంకర్..గద్దర్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు

హైదరాబాద్, మహానాడు:

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి, ప్రజాయుద్ధనౌక గద్దర్ వర్ధంతి పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి వారికి నివాళులర్పించారు. అమెరికా పర్యటలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ట్విటర్ వేదికగా వారికి నివాళులర్పించారు. ఉచ్ఛ్వాస నుండి నిశ్వాస వరకు ఆయన నరనరాన ప్రవహించిన ప్రాణం తెలంగాణ అంటూ ప్రొఫెసర్ జయ శంకర్ సారు జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నానని రేవంత్‌రెడ్డి ట్వీట్‌లో పేర్కొన్నారు. అలాగే మరో



ట్వీట్‌లో పాటకు పోరాటం నేర్పి తన గళంలో తూటాగా మార్చి అన్యాయంపై ఎక్కుపెట్టిన తెలంగాణ సాంస్కృతిక శిఖరం గద్దరన్న వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నానని రేవంత్‌రెడ్డి తెలిపారు.

గద్దర్‌తో తాను గతంలో వివిధ సందర్భాల్లో భేటీయైన ఫోటోలు రేవంత్‌రెడ్డి ట్వీట్‌లో పోస్టు చేశారు.

## 22 గేట్ల ద్వారా సాగర్ నీరు విడుదల

(మొదటిపేజీ తరువాయి..)

ప్రస్తుతానికి ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో సమానంగా ఉన్నాయి. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 585.40 అడుగులు. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం..312.టిఎంసిలు.

ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 298.3005 టీఎంసీలు. ఇన్‌ఫ్లో: 341990 క్యూసెక్కులు కాగా, టోటల్ ఔట్ ఫ్లో 341990 క్యూసెకులు.

## హైదరాబాద్‌లో ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్

(మొదటిపేజీ తరువాయి..)

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని అధికారుల బృందంతో ఆ కంపెనీ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.



రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే సెంటర్ పై ఈ సందర్భంగా చర్చలు జరిపారు.

ఈ కంపెనీ డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమయ్యే ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ అందిస్తుంది. హైదరాబాద్ లో ట్రైజిన్ కంపెనీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ అండ్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేండ్లలో 1,000 మందికి పైగా ఉద్యోగులను నియమించుకొని శిక్షణను అందిస్తుంది. ఈ కంపెనీ మొత్తం ఆదాయం 160 మిలియన్ డాలర్లకు పైగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ కంపెనీలో పని చేస్తున్న 2,500 మందిలో వెయ్యి మంది మన దేశంలో ఉండగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు వంద మంది ఉన్నారు. మరో ఆరు నెలల్లోనే తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు ఈ కంపెనీ ప్రకటించింది.

రెండు దశాబ్దాలకు పైగా ఐక్య రాజ్య సమితితో పాటు అనుబంధ విభాగాలకు ఈ కంపెనీ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. గత ఏడాది నుంచి ట్రైజిన్ కంపెనీ తమ సేవలను అందుకుంటున్న సంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో పాటు ఫలితాలపై విశ్లేషణలు చేస్తోంది. అన్ని రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా ఎంచుకుంది.

## నదుల అనుసంధానంతో కరవు అరికట్టవచ్చు

(మొదటిపేజీ తరువాయి..)

రాష్ట్రానికి జీవనాడైన పోలవరం ప్రాజెక్టు పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా దెబ్బతిన్నడయాఫ్రం వాల్ స్థానంలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణాన్నిరెండు సీజన్లలో పూర్తి చేసి వచ్చే ఏడాది జూన్ నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై కేంద్రంతో తాను కూడా మాట్లాడతానని, అధికారులు కూడా ఢిల్లీ వెళ్ళి సంబంధిత అధికారులతో



మాట్లాడాలని ఆదేశించారు. వెలుగొండ, చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

గోదావరి-పెన్నా, వంశధార-నాగావళి నదుల అనుసంధాన ప్రకియను ముందుకు తీసుకువెళ్ళాలని అధికారులకు స్పష్టం చేశారు. నదుల అనుసంధానంతో భవిష్యత్తులో నీటి ఎద్దడిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చని అన్నారు. గోదావరి డెల్టా కంటే ముందుగా కృష్ణా డెల్టాలో వ్యవసాయ పనులు మొదలయ్యే విధంగా పూర్తి స్థాయిలో నీటిని అందుబాటులో ఉంచాలని అధికారు ఓలకు స్పష్టం చేశారు. పులిచింతల నీటిని అవసరాలకు వాడుకునేలా నీటి నిల్వ ఉంచాలని పేర్కొన్నారు. పురుషోత్తం పట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఏలేరు రిజర్వాయర్ ను పూర్తిగా నింపాలని స్పష్టం చేశారు.

వర్షపాతం వివరాలను విశ్లేషించి ఒక కార్యాచరణతో ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో భూగర్భ జలాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మైక్రో, మ్యాక్రో స్థాయిలో ప్రణాళిక సిద్ధం చేసి నీటి వినియోగంలో పటిష్టమైన పాలసీని తీసుకురావాలని సూచించారు. దీనిలో సామాజిక వేత్తలు, విద్యార్థులు, సాగునీటి నిపుణులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. నీరు సులభంగా పారేందుకు కాలువలు, డ్రైన్లలో గల తూడు, గుర్రపు డెక్క వంటివి తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, రిజర్వాయర్ల పరిస్థితులు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సియంకు వివరించారు. ఇప్పటి వరకూ 64 శాతం రిజర్వాయర్లను నీటితో నింపినట్టు సీఎంకు వివరించారు. ఈసమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, సియం కార్యదర్శి ఎవి.రాజమౌళి, జల వనరుల శాఖ సలహాదారు, అధికారులు వెంకటేశ్వరరావు, లక్ష్మీ ప్రసాద్, సిఇలు, ఎస్ఇలు,ఈఈలు, తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన అన్ని ప్రాజెక్టులు మళ్లీ పట్టాలెక్కాలి

(మొదటిపేజీ తరువాయి..)

చేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గత ప్రభుత్వం కక్ష పూరితంగా రద్దు చేసిన, నిలిపివేసి అన్ని ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు-పెట్టుబడుల శాఖపై ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిలిపివేసి సంపద సృష్టి కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని...మళ్లీ ఆ ప్రాజెక్టులు గాడిన పెట్టి...త్వరితగతిన పూర్తి చెయ్యాలని సీఎం ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు, ఎపి మారిటైం ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పోరేషన్, వివిధ ప్రాజెక్టుల్లో స్పెషల్ పర్పస్ వెహికిల్స్, ఎపి ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సిఎం అన్నారు. వివాదాలకు తావు లేకుండా అన్ని పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఏపీ మారిటైం మాస్టర్ ప్లాన్‌తో పాటు మారిటైం పాలసీ తీసుకువస్తామన్నారు. నాడు సుదీర్ఘ కసరత్తు చేసి తలపెట్టిన ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో నాడు ప్రతిపాదించిన నెల్లూరు జిల్లా దగదర్తి, చిత్తూరు జిల్లా కుప్పం, పల్నాడు జిల్లా నాగార్జున సాగర్ లలో ఎయిర్ పోర్టులు, ఎయిర్ స్ట్రిప్ ల నిర్మాణంతో పాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టాలని అన్నారు.

గతంలో ఈ ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేయడంతో పాటు భూసేకరణ కూడా పూర్తి అయ్యిందని...అయితే గత ప్రభుత్వం వీటిని నిలిపివేసిందని సీఎం అన్నారు. మళ్లీ ఈ ఎయిర్ పోర్టుల నిర్మాణం కార్యరూపం దాల్చాలని ఆదేశాంచారు. రాష్ట్రంలో మొత్తం 12 నుంచి 14 చోట్ల ఎయిర్ పోర్టులు, ఎయిర్ స్ట్రిప్ లు అందుబాటులోకి తేవాలన్నది ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, కాకినాడ జిల్లా తుని ప్రాంతంలో కూడా ఎయిర్ పోర్టులు/ఎయిర్ స్ట్రిప్‌లు నిర్మించే అంశంపై పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కర్నూలు ఎయిర్ పోర్టులో ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేష్ వంటి సంస్థలను తీసుకురావాలన్నారు. ఎయిర్ పోర్టుల ద్వారా సరుకు రవాణా చేసేలా ప్రాజెక్టులు రూపకల్పన చేయాలని సీఎం అన్నారు. ఎయిర్ పోర్టులు, పోర్టులు, నేషనల్ హైవేలు అనుసంధానం చేయడం ద్వారా ఉద్యోగ కల్పనతో పాటు వేగవంతమైన అభివృద్ధి సాధించవచ్చని సిఎం అన్నారు.

ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ ను జిఎడి పరిధిలోకి, ఎపి డిజిటల్ కార్పొరేషన్‌ను ఐ అండ్ పిఆర్ పరిధిలోకి తీసుకురావాలి అని సిఎం అన్నారు. ఎపి టవర్స్ కార్పొరేషన్ ను ఎపి స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ లో విలీనం చేయాలన్నారు. ఒక మంచి లక్ష్యంతో నాడు ఎపి ఫైబర్ నెట్ ప్రాజెక్టును తీసుకొస్తే దానిపైనా విషం చిమ్మి బంగారంలాంటి ప్రాజెక్టును నాశనం చేశారని సిఎం అన్నారు. కరెంట్ స్థంభాల ద్వారా ఫైబర్ నెట్ ఏర్పాటు చేసి కేవలం 10 శాతం ఖర్చుతో ప్రాజెక్టును పూర్తి చేశామన్నారు. 24 వేల కిలోమీటర్ల మేర ఫైబర్ నెట్ నిర్మాణం చేసి 9 లక్షల కనెక్షన్లు ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వ రివర్స్, అసమర్థ పాలన వల్ల 9 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్‌లు 5 లక్షలకు పడిపోయాయని... వాటిలో కూడా నాణ్యమైన సేవలు అందించలేదని సిఎం అన్నారు. నాడు నెలకు రూ.149 లకే సెట్ టాప్ బాక్సుల ద్వారా ఇంటర్ నెట్, కేబుల్ టీవీ ప్రసారాలు అందిస్తే....వైసీపీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును రూ.1258 కోట్ల అప్పుల్లోకి నెట్టేసిందని అన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కంటెంట్ కార్పొరేషన్, డ్రోన్ కార్పొరేషన్, ఎపి టవర్స్ కార్పొరేషన్, గ్యాస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్లను కూడా మళ్లీ గాడిలో పెట్టి సేవలు పునరుద్దరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నాడు జిల్లాల్లో నిర్మాణం తలపెట్టిన ఆర్టిజి సెంటర్లు పూర్తిచేయాలని సూచించారు. సీసీ కెమెరా నెట్ వర్క్ ను వీటికి అనుసంధానం చేయాలని సిఎం అన్నారు.

## అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి..)

దృష్టిసారించాలని, రౌడీలు, ఇతర అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలన్నారు. మహిళలపై, చిన్నారులపై నేరాలపై, సైబర్ నేరాలపై, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ఆదేశించారు. అన్ని వర్గాలతో రోడ్డు భద్రతా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గినట్లు తెలిపారు. మరణాలు తగ్గించేందుకు ప్రమాద ప్రధాన ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 100 ప్రతిస్పందన సమయాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు.

సిఐడీ అడిషనల్ డిజిపి శిఖా గోయల్ నేరాల ధోరణులపై వివరణాత్మక ప్రదర్శన ఇచ్చారు. ప్రధాన నేరాల విశ్లేషణ నివేదికను సమర్పించి, ఆయా నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలపై వివరించారు. టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై, టీజీసీఎస్‌బీ డైరెక్టర్ సైబర్ నేరాలపై ప్రదర్శనలు ఇచ్చారు.

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల నివారణకు యుద్ధప్రాతిపదికన కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. తెలంగాణ మాదకద్రవ్యాల, సైబర్ నేరా లకు కేంద్రంగా మారకుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. సెల్ ఫోన్ దొంగతనాలు, మానవ అక్రమ రవాణా, ద్విచక్ర వాహనాల దొంగతనాలు, ముఠా నేరాలు తదితర అంశాలపై వివిధ అధికారులు ప్రదర్శనలు ఇచ్చారు.

ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి బి.శివధర్ రెడ్డి నక్సలైట్ల సంబంధిత నేరాలు, ఇతర చట్టం-వ్యతిరేక కార్యకలాపాల, శాంతి భద్రతలను ప్రభావితం చేసే ఇతర సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడిషనల్ డిజిపిలు అభిలాష బిష్ట్ (ట్రైనింగ్), వి.వి. శ్రీనివాసరావు (టెక్నికల్ సర్వీసెస్), విజయ్ కుమార్ (పర్సనల్ & వెల్ఫేర్), సంజయ్ కుమార్ జైన్ (బెటాలియన్స్) తమ విభాగాలకు సంబంధించిన అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. సమావేశంలో 33 కేసుల (27 హత్యలు, 6 అత్యాచారాలు)లో నేరస్తులకు లైఫ్ కన్విక్షన్లు పడేలా తగుచర్యలు తీసుకున్న 36 మంది అధికారులు, 30 మంది ప్రాసిక్యూటర్లకు డీజీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశాన్ని తప్పనిసరిగా ప్రత్యక్షంగా నిర్వహించాలని, ప్రతినెలా డిజిపి స్థాయిలో నేరసమీక్ష సమావేశాన్ని వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు.

## షాద్‌నగర్ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ

(మొదటిపేజీ తరువాయి..)

అండగా ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడారు. సీఎం చెప్పిన వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత పోలీసు సిబ్బంది, అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నత అధికారులను ఆదేశించారు.

డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఒక సీఐ సహా ఆరుగురు సిబ్బందిని వెను వెంటనే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వంలో షా ద్ నగర్ వంటి సంఘటనలను సహించేది లేదని డిప్యూటీ సీఎం పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి వైద్య సహాయంతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పరంగా అన్ని విధాల అండగా నిలుస్తామని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారుల ద్వారా బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని పోలీసు ఉన్నత అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు.

## శ్రీవారి దర్శన టికెట్లలో గోల్‌మాల్

(మొదటిపేజీ తరువాయి..)

జరిగినట్లు తనిఖీల్లో టీటీడీ గుర్తించింది. అలాంటి యూజర్లను బ్లాక్ చేసినట్లు తెలిపింది. అలాగే వారికీ మెసేజ్‌లను పంపినట్లు తెలిపింది.

ఇదికాకుండా కొంతమంది బుక్ చేసిన 225 శ్రీవాణి టికెట్లపైనా టీటీడీ దృష్టి సారించింది. ఈ అనుమానిత వ్యక్తులు దర్శనానికి వచ్చిన సందర్భంలో టీటీడీ విజిలెన్స్ తనిఖీలు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
3
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 07, ఆగస్టు 2024



# జనసేనలోకి విశాఖ వైసీపీ కార్పొరేటర్లు

- పార్టీలోకి ఆహ్వానించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్

**మంగళగిరి,మహానాడు:**

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కి చెందిన పలువురు వైసీపీ కార్పొరేటర్లు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ కండువాలు కప్పి వీరందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జీవీఎంసీ 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, 47వ వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, 77వ వార్డు కార్పొరేటర్ భట్టు సూర్యకుమారి, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి భర్త శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొవగాపు సుశీల,బొడులపాటి ఉమామహేశ్వరరావు, శ్రీ కనకమహాలక్ష్మి ఆలయ మాజీ ఛైర్మన్ జెర్రిపోతుల ప్రసాద్, లోక్ సత్తా జోనల్ మాజీ నాయకులు మంచిపల్లి సత్యనారాయణ, వైసీపీ సీనియర్ నాయకులు పాపిరెడ్డి మహేశ్వరరెడ్డి తదితరులు మంగళవారం పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. విశాఖ దక్షిణ శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో వీరంతా జనసేనలో చేరారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఎన్నికల తరవాత మొట్టమొదటి రాజకీయపరమైన చేరికలు ఇవి. నాకు ఎంతో ఇష్టమైన విశాఖ నుంచి మొదలు కావడం ఆనందంగా ఉంది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. పార్టీలో కొత్తగా చేరిన నాయకులంతా రాజకీయంగా ఎదగాలని కోరుకుంటున్నాను. పార్టీ కోసం కష్టపడిన జన సైనికులు, వీర మహిళలతో మమేకమై ముందుకు వెళ్లాలి. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి తరఫున బలంగా విజయం సాధించే విధంగా అంతా కృషి చేయాలి.

### విశాఖలో పొల్యూషన్ ఆడిట్ నిర్వహిస్తాం

విశాఖలో కాలుష్య సమస్య చాలా ఎక్కువగా ఉంది. దేశంలోనే వాయు, జల కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరంగా ఉంది. కార్పొరేటర్లుగా మీ అందరిపై కాలుష్య నియంత్రణ బాధ్యత ఉంది. పర్యావరణశాఖ మంత్రిగా కాలుష్య నియంత్రణ మండలి నా పరిధిలోనే ఉంది. ఎక్కడైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి. విశాఖలో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉంది. విశాఖలో రియల్ ఎస్టేట్ సమస్యలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. అన్నింటినీ పరిశీలించి ప్రజలకు న్యాయం చేద్దాం" అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం జనసేన ఇంఛార్జ్ పంచకర్ల సందీప్, రాష్ట్ర కార్యదర్శి అంగ దుర్గా ప్రశాంతి, జీవీఎంసీ కార్పొరేటర్లు భీశెట్టి వసంత లక్ష్మి, దల్లి గోవిందరెడ్డి, కందుల నాగరాజు, సాదిక్, వీరమహిళ ప్రాంతీయ కో ఆర్డినేటర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### రికార్డు స్థాయిలో క్రియాశీలక సభ్యత్వాలు

అనంతరం పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనర్ కళ్యాణం శివశ్రీనివాస్, పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ కి కూరగాయల గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. చివరి రోజు సాయంత్రానికి లక్ష్యానికి మించి 12 లక్షలకు పైగా క్రియాశీలక సభ్యత్వాలు నమోదయ్యాయని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని హరిప్రసాద్ అధ్యక్షుల వారికి తెలిపారు.

# గుంటూరులో గంజాయి పట్టివేత

**గుంటూరు, మహానాడు:**



గుంటూరులో 20.5 కేజీల గంజాయి పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేఖర్లతో మాట్లాడారు. ఈ కేసులో ఎనిమిది మంది నిందితులు వున్నట్లుగా గుర్తించి, ఇప్పటికి నలుగురిని అరెస్టు చేసినట్లుగా ఎస్పీ వెల్లడించారు. నిందితుల్లో చేబ్రోలు, వట్టిచేరుకూరు, నల్లచెరువు ఏరియా వారు నిందితులుగా ఉన్నారని తెలిపారు.

## గంజాయి మత్తుతో
# నా కొడుకు పిచ్చోడయ్యాడు

- విజయవాడకు చెందిన ఓ మహిళ ఆవేదన
- గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపైనే అధికంగా ఫిర్యాదులు
- ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందిస్తున్న జనసేన ప్రజా ప్రతినిధులు
- మంగళవారం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వేదికకు వినతుల వెల్లువ

**మంగళగిరి,మహానాడు:**

గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి సరఫరా ఎంత దారుణంగా జరిగిందో, దాని బారిన పడి తన కొడుకు ఎంత పాడయ్యాడో ఓ తల్లి ఆవేదన చెందారు. టీడీపీకి అనుకూలంగా ఉన్నామని గత ప్రభుత్వంలో ఎంత అన్యాయంగా ఉద్యోగాలు తొలగించారో మరో వ్యక్తి తన గోడు చెప్పుకొంటూ భోరుమన్నారు. ఒకటి కాదు రెండు కాదు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలు, అన్యాయాలు అర్జీదారులు చెబుతుంటే వాటికి ఎలాంటి పరిష్కారం చూపాలన్న మథనం కూడా జనసేన పార్టీ ప్రజా ఫిర్యాదుల వేదికలో జరుగుతోంది.

జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల వేదికకు రాష్ట్రంలోని నలు వైపుల నుంచి ఫిర్యాదులు వేలాదిగా వస్తున్నాయి. జనసేన పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. వారి సమస్యలను వింటూ వెంటనే పరిష్కారం చూపేలా అధికారులతో మాట్లాడుతున్నారు. మంగళవారం ప్రజా ఫిర్యాదులను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తీసుకున్నారు. ఫిర్యాదులు వెంటనే పరిష్కారం అయ్యేలా చొరవ చూపారు.

### నా కొడుకును ఆస్పత్రిలో చేర్చండి

విజయవాడకు చెందిన వై.జయలక్ష్మి – తన ఒక్కగా నొక్క కొడుకు గత ఐదేళ్లుగా విచ్చలవిడిగా దొరికిన గంజాయికి అలవాటుపడిపోయాడని గోడు వెళ్లబోసుకున్నారు. చనిపోతానని బెదిరిస్తున్నాడని కన్నీటి పర్యంతమైంది. పురుగుల మందు తాగాడని, బ్లేడుతో చేతులు కోసుకున్నాడని, ప్రతి రోజూ ఏదో ఒక గొడవ తీసుకువస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు చెప్పినా మారడం లేదని, గంజాయి కోసం దొంగతనాలకు అలవాటుపడ్డాడని, పిచ్చివాడిగా మారిపోయాడని తెలిపారు. తన కొడుకును నయం చేయడానికి విశాఖ మానసిక వైద్యశాలకు పంపాలంటూ





భోరున విలపించారు.

కృష్ణా జిల్లా, ఉంగుటూరు మండలం, చాగంటిపాడు గ్రామంలో రైల్వే గేటు విషయంలో ఇబ్బందులు ఉన్నాయని గ్రామస్తులు విన్నవించారు. గేటు పెట్టే సమయంలో పంచాయతీ సిబ్బంది ప్రజాభిప్రాయాన్ని వక్రీకరించి పంపారని, దీనివల్ల గేటు విషయంలో ఇబ్బందులు కలుగు తున్నాయని, సమస్య పరిష్కరించాలని కోరారు.

పర్చూరు నియోజకవర్గంలో గతంలో రక్షిత మంచినీటి సరఫరా శాఖలో వాటర్ టెస్టింగ్ విభాగంలో కెమిస్ట్ గా పని చేసిన నార్ని చంద్రశేఖర్ అనే వ్యక్తి గత ప్రభుత్వం తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించిందని, న్యాయం చేయాలని కోరారు. టీడీపీకి అనుకూలంగా ఉన్నానని ఆరోపిస్తూ నన్ను ఉద్యోగం నుంచి తొలగించారని, తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించాలని కోరారు.

కర్నూలు జిల్లా జోహరాపురం గ్రామంలో 500 మంది బీడీ కార్మికులకు గతంలో తాహసీల్దారు స్థలాలు ఇచ్చారని, అయితే ఈ స్థలాలు తమవంటూ ఓ మహిళ వాటిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని బీడీ కార్మికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ స్థలం పక్కనే ఉన్న స్థలం తనదని, ఈ స్థలాల మీద కూడా తనకు హక్కు ఉందని చెబుతూ కార్మికులను అటువైపు వెళ్లకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాలు తప్పు అంటూ దొంగ పట్టాలు సృష్టించారని ఆరోపించారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.



# తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిన సుష్మా స్వరాజ్

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహానాడు:**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీజేపీ సీనియర్ నేత సుష్మా స్వరాజ్ వర్ధంతి కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివంగత సుష్మా స్వరాజ్ వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ తరపున శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. సుష్మాస్వరాజ్ భారతీయ జనతా పార్టీలో అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించి, అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సుష్మాస్వరాజ్ పార్లమెంట్ లో ప్రత్యేక తెలంగాణ కోసం అనేక పోరాటాలతో కీలక పాత్ర పోషించారు. ఆ రోజుల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నేను పనిచేశాను. నాడు తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఉద్యమకారులకు మద్దతుగా రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన అనేక సభల్లో సుష్మాస్వరాజ్ మాట్లాడి, చైతన్యం నింపారు. సకలజనుల సమ్మె జరిగినప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులపై, ప్రజలపై పోలీసు నిర్భంధం పెట్టి అనేక రకాల వేధింపులకు గురిచేసింది. సంపన్న వర్గాల ప్రజలు, విద్యార్థులు రాష్ట్ర సాధన కోసం నినదించిన గొంతులు, రబ్బరు బుల్లెట్లు, లాఠీ దెబ్బలను లెక్కచేయకుండా పోరాడారు. సుష్మాస్వరాజ్ నాడు ఉద్యమకారులకు అండగా నిలబడ్డారు. ధైర్యం కల్పించారు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకురాలిగా సుష్మాస్వరాజ్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర బిల్లు పెట్టే సమయంలో క్రియాశీలక పాత్ర పోషించి తెలంగాణ ప్రజలకు బాసటగా నిలిచారు. లోక్ సభలో ఉద్యమకారులకు, ఓయూ విద్యార్థులకు మద్దతుగా గొంతెత్తి, తెలంగాణ వాణి వినిపించిన గొప్ప నాయకురాలు. లోక్‌సభలో ఓటింగ్ కోసం తెలంగాణ బిల్లు పెట్టాలని నాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు.



ప్రతిపక్ష పార్టీ నాయకురాలిగా విభజన చట్టం గురించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు పాస్ కాకుండా కారంనీళు చల్లినా, కత్తులతో లోక్ సభలోకి వచ్చినప్పుడు.. వారందరినీ ఎదిరించి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, 160 మంది పార్లమెంటు సభ్యులతో తెలంగాణ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయించిన ఘనత ఆమెకే దక్కుతుంది. తెలంగాణ అమరవీరులు, స్వర్గీయ సుష్మాస్వరాజ్ ఆశయసాధనలో బిజెపి కార్యకర్తలందరు పునరంకితమై, వారి అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తాం. సుష్మాస్వరాజ్ స్ఫూర్తి, అమరవీరుల స్ఫూర్తితో ప్రజాస్వామ్య తెలంగాణను సాధించుకునేలా కృతనిశ్చయంతో పనిచేస్తాం.

# భవన నిర్మాణ కార్మికుల పథకాలను అమలు చేయాలి

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు కార్మికుల విన్నపం

**వినుకొండ, మహానాడు:**

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పల్నాడు జిల్లా భువన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు అవ్వరు ప్రసాదరావు కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్మిక బోర్డు పథకాల అమలుకు అడ్డుగా ఉన్న మెమో నెంబర్ 1241ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. అయిదేళ్ళుగా ఉన్న 3 కోట్ల రూపాయలకు పైగా పెండింగ్లో ఉన్న కార్మికుల క్లైమ్ లన్నింటినీ పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు స్పందిస్తూ భవన నిర్మాణ కార్మికుల కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి అంగలకుదురు ఆంజనేయులు, వెంకటప్పయ్య తదితరులు ఉన్నారు.



## కాశ్మీరీ వలసవాదుల భద్రత,
# స్వయం ఉపాధికి కేంద్రం చర్యలు

- వివరాలు వెల్లడించిన హెూం మంత్రిత్వ శాఖ

**ఢిల్లీ, మహానాడు:**

కాశ్మీరీ వలసదారుల భద్రత ఉపాధి కోసం కేంద్రం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మంగళవారం దీనికి సంబంధించిన సమాచారంతో పాటు గణాంకాలను హెూం మంత్రిత్వ శాఖ వివరాలు తెలిపింది. ఆ డేటా ప్రకారం, ప్రధాన మంత్రి అభివృద్ధి ప్యాకేజీ–2015, ప్రధానమంత్రి పునర్నిర్మాణ పథకం–2008 కింద మంజూరైన 6,000 ప్రభుత్వ ఉద్యోగాల్లో 5,724 మంది కాశ్మీరీ వలసదారులు నియమితులయ్యారు. నిరుద్యోగ యువతకి స్వయం ఉపాధి పథకాల కింద ఆర్థిక సాయం పొందేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. కాశ్మీరీ వలసదారుల భద్రత కోసం తీసుకున్న చర్యలు పటిష్టమైన భద్రతతో పాటు ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, స్టాటిక్ గార్డ్ రూపంలో గ్రూప్ సెక్యూరిటీ, వ్యూహాత్మక పాయింట్ల వద్ద 24 గంటల చెక్‌పోస్టులు, నైట్ పెట్రోలింగ్ మరియు ఏరియా డామినేషన్, సున్నితమైన ప్రదేశాల గుర్తింపు, భద్రతా బలగాల సరైన మోహరింపు, ఇంటెన్సివ్ ఉన్నాయి. కార్డన్ శోధన కార్యకలాపాలు ఉంటాయి.

అర్హులైన కాశ్మీరీ వలసదారులకు నెలకు కుటుంబానికి గరిష్టంగా రూ. 13,000/– పరిమితితో ఒక్కొక్కరికి రూ. 3,250 నగదు సహాయం అందుతోంది. అర్హులైన కాశ్మీరీ వలసదారులకు ప్రతి నెలా ఒక్కొక్కరికి 9 కిలోల బియ్యం, ప్రతి వ్యక్తికి 2 కిలోల పిండి, ఒక కుటుంబానికి 1 కిలో చక్కెర రేషన్‌గా ఇస్తారు. కాశ్మీరీ వలసదారులకు తిరిగి రావడానికి ప్రధానమంత్రి ప్యాకేజీ కింద రిక్రూట్ చేయబడిన ఉద్యోగుల కోసం కాశ్మీర్ వ్యాలీలో 6,000 రవాణా వసతి కల్పించారు. జమ్మూ, కాశ్మీర్ ప్రభుత్వం ఆగస్టు



2021లో ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది, ఇక్కడ కాశ్మీరీ వలసదారులు ఆక్రమణ శీర్షికలో మార్పు, మ్యుటేషన్, బాధల విక్రయానికి సంబంధించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చు. కాశ్మీరీ వలసదారులకు ఆయుష్మాన్ గోల్డెన్ హెల్త్ కార్డులు జారీ చేశారు మంచి ఆరోగ్య సౌకర్యాల కోసం, శిబిరాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు డిస్పెన్సరీలు ఏర్పాటు చేశారు.

ఐదు ప్రభుత్వ పాఠశాలలు (4 హయ్యర్ సెకండరీ స్థాయి, 1 సెకండరీ స్థాయి) స్థానభ్రంశం చెందిన పిల్లల విద్య కోసం శిబిరాల్లోఏర్పాటు. ఆన్‌లైన్ పోర్టల్ www.jkmigrantrelief.nic.in ద్వారా అర్హులైన వలస విద్యార్థులకు మైగ్రేషన్ సర్టిఫికేట్ జారీ. కాశ్మీరీ వలసదారుల సౌలభ్యం కోసం, నివాస ధృవీకరణ పత్రం, ప్రాంత నివాస ధృవీకరణ పత్రం, వలస ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆర్థికంగా బలహీనమైన విభాగం (EWS) సర్టిఫికేట్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఆన్‌లైన్‌లో జారీ.

4

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 07, ఆగస్టు 2024













# అక్రమ కేసులు..
# హత్యలపైనే అధిక ఫిర్యాదులు



- **వైసీపీ పాలనలో అక్రమంగా సస్పెండ్ చేశారంటూ పోలీసుల కన్నీరు**
- **2023 పోలీస్ రిక్యూర్మెంట్‌లో తప్పుడు మార్కుల వలన ఆగిన నియామకాలను కొనసాగించాలని వినతి**
- **భూ కబ్జాలు, చోరీలు, బెదిరింపులపై మంగళగిరికి తండోప తండాలుగా తరలివచ్చిన అర్జీదారులు**

**అమరావతి, మహానాడు:**

ప్రజా తీర్పుతో వైసీపీ ప్రభుత్వం కూలి, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో వైసీపీ పాలనలో జరిగిన ఘోరాలు ఒక్కొక్కొటీ బయటపడుతున్నాయి. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమంలో వైసీపీ నేతల అరాచకాలు రట్టు అవుతున్నాయి. ఆ వివరాలివి.

- టీడీపీ అభిమాని కావడంతో తెలుగుదేశం ప్రచార కార్యక్రమాలకు శ్రేణులను తీసుకెళ్లినందుకు తన తండ్రిని అతికిరాతంగా చంపి... అక్రమ కేసుల్లో తనను ఇరికించి రెండు నెలలు జైల్లో ఉంచారని.. బతుకు దెరువు కోసం



తన భర్త విదేశాలకు వెళ్లాడని.. తనకు దిక్కు ఎవరు లేరని.. తోట త్రిమూర్తులు, ఆయన అనుచరులు కోరుకొండ రమణలకు భయపడి తాము హైదరాబాద్‌కు వెళ్లి తలదాచుకుంటున్నా మని.. తమ తండ్రిని చంపిన వారిని శిక్షించి తనపై మోపబడిన అక్రమ కేసులను తొలగించాలని కోనసీమ జిల్లా రాయవరం మండలంకు చెందిన సునా ఫాతిమా మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల కార్య క్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యలకు వినతిని అందించి న్యాయం చేయాలంటూ కన్నీళ్ళపర్యంతమయ్యారు. తన తండ్రిని దారుణంగా చంపిన ఫోటోలను చూపిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు.

- కడప జిల్లా వేముల మండలం నల్లచెరువుపల్లె గ్రామానికి చెందిన రామన్న విజ్ఞప్తి చేస్తూ.. వైసీపీ నేత రవికుమార్ రెడ్డి తన భూమిని అక్రమించుకొని తనను తన భూమిలోకి రానివ్వడంలేదని, దయ ఉంచి తన భూమిని ఆక్రమణ నుండి విడిపించాలని రామన్న గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు.
- నంద్యాల మండలం కానకాల గ్రామ పంచాయతీలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర రెడ్డి అనుచరులు తమ భూమిని అక్రమించుకుని భూమిలోకి వెళ్లకుండా దౌర్జనం చేస్తున్నారని అల్లూరు షభాన వాపోయారు.. తమ భూమిన వైసీపీ నేతల ఆక్రమణ నుండి విడిపించాలని విజ్ఞప్తి చేశారు.
- కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం లంకపల్లిలో ఇటీవల జరిగిన వృద్ధురాలి హత్యపై తమకు అనుమానాలు ఉన్నాయని... అది దొంగతనం కోసం జరిగిన హత్య కాదని.. పూర్తి విచారణ చేపట్టి నిజాలు తేల్చాలని వృద్ధురాలి బంధువులు నేడు గ్రీవెన్స్‌లో వినతిని అందించారు.
- ప్రకాశం జిల్లా కొత్త పట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన రేవూరి అబ్రహాం విజ్ఞప్తి చేస్తూ... తాను టీడీపీ కోసం పనిచేస్తుండటంతో తనపై వైసీపీ నాయకుడు తలారి చరణ్ అక్రమ కేసులు పెట్టాడని. అంతేకాకుండా సోషల్ మీడియాలో నిరాధారమైన పోస్టులతో వేధిస్తున్నాడని.. ఈ విషయంపై కొత్తప్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.
- తన బంధువులతో టీడీపీకి ఓట్లు వేయించినందుకు రాత్రికి రాత్రే తన భూమిలో వైసీపీ నేతలు ఇళ్లు కట్టారని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో తొలగించిన ఇళ్లు... మళ్లీ కట్టి తనను ఇబ్బంది పెడుతున్నారని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాల గ్రానికి చెందిన పురిణి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.
- గత ప్రభుత్వంలో అన్యాయంగా తమను విధుల నుండి తొలగింపులకు గురైన హోంగార్డులు మంగళగిరి టీడీపీ కార్యాలయానికి పెద్దఎత్తున వచ్చి హోంమంత్రికి విన్నవిం చారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు.
- పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అనుచరులు తమ భూమిని అక్రమించుకున్నారని... వీధి రౌడీలతో దాడి చేయించారని దీనిపై ముదివేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కురబలకోట మండలం అంగళ్లు గ్రామం మజరా ఎర్రజనివారిపల్లో ఉండే నల్లతాత గారి వెంకటరమణా రెడ్డి నేడు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గం నవాబు పేట గ్రామంలో 360 ఎకరాల ప్రభుత్వ సొసైటీ చెరువులో అక్రమంగా చేప లను పెంచుతూ... ప్రశ్నిస్తే వైసీపీ నేతలు అక్రమ కేసులు పెడుతున్నారంటూ నవాబు పేట గ్రామస్తులు పలువురు నేడు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.
- ఆర్మీ సోల్జర్ కోటాలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికి వెళితే తమపై దాడి చేశారని అంతే కాకుండా తమపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టా రని.. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన పలివెల విజయలక్ష్మి వాపోయారు
- ఏపీలోని అన్ని జిల్లాలలో జాతీయ దివ్యాంగుల హక్ల చట్టం 2016 ప్రకారం ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ర్యాంపులు, దివ్యాంగుల హక్కుల చట్టంలోని సెక్షన్ 92లను అమలు పరచాలని షేక్ కాలేషా విజ్ఞప్తి చేశాడు. అలాగే 2014



–2019లో ఇచ్చిన టిడ్కో ఇళ్లను పొందిన దివ్యాంగులకు వారి కుటుంబ సభ్యులకు రుణాలను మాఫీ చేయాలని కోరారు.
- గుంటూరు పరిధిలో గిరిజనులకు ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పదోన్నతిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించక పోవడం వలన అన్యాయం జరుగుతుందని అంతే కాకుండా ఖాళీలు లేకుండా (Roster points) సీఐ, ఎస్సైలుగా పనిచేస్తున్నారని వీటిపై సమగ్ర విచారణ జరిపి సర్వీసు పరంగా నష్టపోయిన ఎస్టీ క్యాటగిరీ పోలీసులకు న్యాయం చేయాలని గ్రీవెన్స్ లో వినతి అందించారు.
- ఏపీ ప్రభుత్వం మహిళలకోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయానణం ఏర్పాటు చేస్తున్నందున ఏలూరు – ద్వారకా తిరుమల రూట్‌లో రద్దుచేసిన ఆర్టీసీ బస్సులను తిరిగి పునరుద్ధరించాలని ఆ ప్రాంత గ్రామాల నుండి వచ్చిన ప్రజలు నేడు గ్రీవెన్స్‌లో వినతిని అందించారు.
- ఉర్థూ మీడియం స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ పండిట్ పోస్టులకు ఇప్పటి వరకు లిమిటెడ్ రిక్రూట్ మెంట్ పెట్టలేదని.. ఇప్పుడు లిమిటెడ్ పెట్టడం వలన డీఎస్సీ 2018లో క్వాలిఫైడ్ అయిన మెరిట్ అభ్యర్థులకు తీవ్రంగా అన్యాయం జరుగు తుందని.. 2018లో మైనర్ మీడియా ఉర్థూ బ్యాకలాగ్ స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ పండింట్ పోస్టులను స్పెషల్ కేసు కింద పరిగణించి పస్ట్, సెకండ్ ర్యాంకులను సాధించి క్వాలిఫైడ్ అయిన తమకు రూల్ రిలాక్సేషన్ లేదా స్పెషల్ కేసుగా కన్సిడర్ చేయాలని వారు అభ్యర్థించారు.
- ఉద్యోగం పేరుతో డబ్బులు దండుకుని మోసం చేశారంటూ పలువురు ఫిర్యాదు చేయగా... తాము అర్హులమైనా తమకు గత ప్రభుత్వంలో ఇంటి స్థలం మంజరు చేయలేదని పశ్చిమ గోదావరి జిల్లా ఉండికి చెందిన రాజేశ్వరి వాపో యారు. తమకు రావాల్సిన ఆస్తులను తమ సోదరులు వైసీపీ నాయకుల అండతో కొట్టేయాలని తాము తమ తల్లిదండ్రులకే పుట్టలేదని దొంగ సర్టిఫికేట్లు పుట్టించారని నంద్యాల జిల్లాకు చెందిన ఆవుల నాగమణి, ఆవుల భారతి, ఆవుల నాగేశ్వరిలు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు.
- ట్రిపుల్ తలాఖ్ పేరుతో తన భర్త తనకు దూరంగా ఉంటున్నాడని.. దూరంగా ఉండటంతో భరణం కింద డబ్బులు కట్టాలని కోర్టు ఆదేశించినా.. పట్టించుకోకుండా తనను తనపిల్లలను తనను మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడని మంగళిరికి చెందిన షేక్ షబానా హోంమంత్రి ముందు కన్నీళ్ళపర్యంతమైంది.
- వైసీపీ కోసం తొత్తులగా పనిచేసిన పోలీసులు పెట్టిన అక్రమ కేసులుపై మరికొందరు ఫిర్యాదు చేయగా.. భూ సరిహద్దు తగాదాలపై కొందరు. దొంగిలించిన సొమ్ములను రికవరీ చేయాలంటూ మరికొందరు.. చేసిన పనులకు బిల్లు రాలేదని పలువురు..

వైసీపీ పాలనలో అన్యాయానికి గురైన ఉద్యోగులు ఇలా వందల సంఖ్యలో అర్జీదారులు నేడు తమ వినతులను టీడీపీ కార్యా లయంలో అందించి న్యాయం చేయాలని అర్థించారు.







జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 07, ఆగస్టు 2024



# పండగలా 'హర్ ఘర్ తిరంగా'

● **బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు**

హైదరాబాద్, మహానాడు:

ఆగస్టు 15 సందర్భంగా ఈ సంవత్సరం కూడా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించుకోవాలని నిర్ణయించినట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 7న అన్ని జిల్లాల్లో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం



నిర్వహణ కోసం విధివిధానాలపై చర్చించడం జరిగింది. ఆగస్టు 8, 9 తేదీల్లో అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా కార్యక్రమం నిర్వహించి విజయవంతం చేసేలా కార్యాచరణ రూపొందించడం జరిగింది. ఆగస్టు 10, 11 తేదీల్లో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల వద్ద శుభ్రం చేసి ఆ మహనీయులకు నివాళులర్పించి, స్మరించుకునేలా ఏర్పాట్లు చేసుకునేలా నిర్ణయం తీసుకున్నాం.

ఇదిలా వుండగా, బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నేడు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. స్మారక చిహ్నాల వద్ద స్వచ్ఛ భారత్ కింద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 11, 13 తేదీల్లో జిల్లా కేంద్రాలు, అసెంబ్లీ కేంద్రాలు, ప్రతి మండలం, మున్సిపాలిటీల స్థాయిలో యువమోర్చా ఆధ్వర్యంలో తిరంగ యాత్ర నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఆగస్టు 12న మహిళా మోర్చా ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో మహిళలతో బైక్ ర్యాలీల నిర్వహణ. ఆగస్టు 13-15 వరకు ప్రతి కార్యకర్త ప్రతి ఇల్లు, భవనాన్ని సందర్శించి, ప్రజలందరు "హర్ ఘర్ తిరంగ'లో భాగస్వాములయ్యేలా చూడాలి. ఆగస్టు 13వ తేదీన రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోని ప్రముఖమైన, ప్రసిద్ధగాంచిన ప్రాంతాల్లో సంఘసేవకులు, ప్రముఖులను సమీకరించి, సామూహికంగా జాతీయ గీతాలాపన కార్యక్రమం చేపడుతాం. ఆగస్టు 14న 'విభజన గాయాల స్మారక దినం' భారతదేశ విభజన ఘోరమైన ఉచకోతలతో కూడిన, ప్రజలు ప్రాణాలరచేత పెట్టుకొని ఇల్లు, వాకిలి వదిలిన విషాద గాథగా మిగిలిన చీకటి అధ్యాయాన్ని జిల్లా కేంద్రాల్లో హాల్ మీటింగ్స్ నిర్వహించి ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమాలు చేపడుతాం. ఆగస్టు 15న రాష్ట్రంలో ప్రతి బూత్ లో, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించాం.


తెలంగాణ రాష్ట్రంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ అర్హులైన రైతులందరికీ అమలు చేయకుండా మోసం చేసింది. రుణమాఫీ కాని రైతులకు అండగా నిలిచేలా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కు అద్భుత స్పందన వస్తోంది. ప్రతిరోజు వేలాది మంది బాధిత రైతుల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయి. రానున్న రెండు రోజుల్లో ప్రతి జిల్లాలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాం. రచ్చబండ కార్యక్రమాల అనంతరం రైతుల సమస్యల పరిష్కారం కోసం, రైతులకు ఇచ్చిన 7 ప్రధాన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ప్రశ్నించేలా, గోసపడుతున్న రైతులకు న్యాయం జరిగేలా సమావేశాలు నిర్వహిస్తాం. స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయమత్తేలా కార్యాచరణను రూపొందించుకునేలా విస్తృత చర్చ జరిగింది. సంస్థాగతంగా పార్టీ నిర్మాణమయ్యేలా ప్రత్యేక కార్యాచరణను అమలు చేసేలా నిర్ణయం తీసుకున్నాం. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ పరంగా సిద్ధమయ్యేలా విస్తృత చర్చ జరిపి, అనేక నిర్ణయాలు తీసుకున్నాం.

## తెలంగాణలో ఐటీ ఎగుమతులు,

# ఉద్యోగాల క్షీణత ఆందోళనకరం

● **రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై ప్రభావం చూపుతుందని కేటీఆర్ ఆవేదన**

హైదరాబాద్, మహానాడు:



తెలంగాణలో ఐటీ ఎగుమతులు, ఉద్యోగాలు క్షీణించటంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మాజీ మంత్రి కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల్లో క్షీణతకు సంబంధించిన గణంకాలను ఆయన ట్వీట్ చేశారు. 2022-23 సంవత్సరంలో తెలంగాణ నుంచి 57,706 కోట్ల ఐటీ ఎగుమతులు ఉంటే 2023-24 కాలానికి 26,948 కోట్ల ఎగుమతులే జరిగాయని పేర్కొన్నారు. ఇక ఐటీ ఎంప్లాయిమెంట్ కల్పన కూడా భారీగా పడిపోయింది... 2022-23 కాలంలో 1,27,594 కొత్త ఉద్యోగాలు వస్తే... 2023-24 లో కేవలం 40,285 ఉద్యోగాలు మాత్రమే కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు.

**గత ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది...**

గత ఆర్టేడేళ్లలో తెలంగాణలో ఐటీ ప్రగతి గణనీయంగా పెరిగేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని కేటీఆర్ గుర్తు చేశారు. సింగిల్ విండో విధానం, టీఎస్ ఐపాస్, ఐటీ రంగానికి సంబంధించి ప్రభుత్వ పాలసీల కారణంగా అత్యంత వేగంగా హైదరాబాద్ లో ఐటీ రంగం అభివృద్ధి చెందిందన్నారు. హైదరాబాద్ ను దేశానికి ఐటీ కేంద్రంగా చేసేందుకు ఎంతో కృషి చేశామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐటీ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్థిక ప్రగతికి ఐటీ రంగం పురోగతి ఎంతో మేలు చేసిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఐటీని రంగాన్ని పట్టించుకోకపోతే రాష్ట్రం ఆర్థికంగా, ఉపాధి కల్పన పరంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ఐటీతో పాటు ఐటీఈఎస్ రంగాలకు ప్రాముఖ్యత ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మళ్లీ నగరంలో ఐటీ రంగం పుంజుకోవాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా దీనిపై ఫోకస్ పెట్టాలని కోరారు. ఔత్సహిక యువ పారిశ్రామికవేత్తలకు, స్టార్ట్ అప్ కంపెనీలకు అన్ని విధాలుగా మద్దతు ఇవ్వాలని...ఐటీ రంగానికి ఉపయోగపడే విధానాలు తేవాలని కోరారు. ఐటీ సంస్థలు మరిన్ని పెరగాలంటే ఎప్పటికప్పుడు మౌలిక సదుపాయాలను పెంచుతూనే....లా అండ్ ఆర్డర్ ను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం నిరంతరం దృష్టి పెట్టాలని కేటీఆర్ సూచించారు.

# రెవెన్యూ శాఖలో పదోన్నతులు కల్పించండి

● **మంత్రి పొంగులేటిని కోరిన డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్**

హైదరాబాద్, మహానాడు:



రెవెన్యూ శాఖలో అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్న తులు కల్పించాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామ కృష్ణ కోరారు. పదోన్నతులు లభించక పోవడంతో ఏళ్ల తరబడి ఉద్యోగులు ఎదురు చూస్తున్నట్టుగా తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి గ్రామ స్థాయిలో అనుభవం ఉన్నవారికి అవకాశం కల్పిం చాలని కోరారు.

తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం కలిశారు. రైతులకు మేలు చేసేలా, బలోపేతానికి ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కొత్త ఆర్వోఆర్ చట్టం-2024 ముసాయిదా చాలా బాగుందని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త ఆర్వోఆర్ చట్టంతో రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ చట్టం దేశంలో ఉత్త మైన చట్టంగా మిగిలిపోతుందన్నారు. దీంతో పాటు ఇటీవల 9 మంది తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించినందుకు కూడా మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి సైతం కొత్త ఆర్వోఆర్ చట్టం ముసాయిదాకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందించినందుకు సంఘం నేతలను అభినందించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాహనాల బిల్లులను సైతం త్వరగా మంజూరు చేయాలని మంత్రిని కోరారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు చేపట్టే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గ్రామానికో అధికారిని నియమించే దాంట్లో రెవెన్యూ శాఖలో అనుభవం ఉన్న వారికే అవకాశం ఇస్తే రైతులకు, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు బి.గీత, ఎన్.నిర్మల, ఎల్.సుధా, రామ్మూర్తి, వెంకటేశం, ఎం.జయమ్మ, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

# దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పోరేట్లను బహిష్కరించాలి

● **ఆగస్టు 9 క్విట్ కార్పొరేట్స్ డే**

పూర్వకాలంలో 18వ శతాబ్దం వరకు ప్రపంచం మొత్తం మీద భారతదేశం అత్యధిక వస్తూత్పత్తి (GDP) కల్గివుండేది. దరిమిలా చైనా మొదటి స్థానంలోకి చేరింది. బ్రిటన్కు చెందిన ఈస్ట్ ఇండియా కంపెనీ మన దేశంలో వ్యాపారం కోసం ప్రవేశించి, అధికారాన్ని కైవసం చేసుకొన్న దరిమిలా మనదేశ ప్రజల కష్టార్జితాన్ని దారుణంగా లూఠీచేసింది.


మన ప్రజలు ఉత్పత్తి చేసే బట్టలు, ఇతర వస్తువుల పైన పన్నులు విధిస్తూ మన దేశం నుండి ఇంగ్లండ్కు పన్ను లేకుండా పత్తిని తీసుకు వెళ్ళి, అక్కడ బట్టల మిల్లులలో తయారైన వస్త్రాలను పన్నులు లేకుండా మనదేశంలో అమ్మడం వల్ల క్రమేపీ దేశీయ వస్త్ర పరిశ్రమ, చేనేత కార్మికుల స్థితిగతులు దారుణంగా దెబ్బతిన్నా యి. ఇతర చేతి వృత్తుల ఉత్పత్తులు దెబ్బ తిన్నాయి. ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత వాటా 24.4% వున్నదల్లా 1950 నాటికి 4.2%కి తగ్గిపోయింది. స్వాతంత్ర్యానంతరం పంచవర్ష ప్రణాళికలు, ప్రభుత్వ రంగంలో భారీ పరిశ్రమలు, లైసెన్స్-పర్మిట్ విధానాల ద్వారా నియంత్రణ కొనసాగుతూ వచ్చాయి.

1990 నాటికి విదేశీ మారకద్రవ్య చెల్లింపులలో సమస్య తలెత్తి, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (I.M.F) వద్ద నుండి రుణ సేకరణ, దానితోపాటు ఆర్థిక వ్యవస్థలో నియంత్రణను తొలగించడం, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం మున్నగు ఆర్థిక సంస్కరణలు చేపట్టబడ్డాయి. ఆర్థికవ్యవస్థ పుంజుకుంటూ వుండగా తీవ్రమైన ఆర్థిక వ్యత్యాసాలు చోటు చేసుకొంటూ వచ్చాయి.

2000లో కేవలం 9 మంది బిలియ నీర్లు (రూ.100 కోట్ల డాలర్లపైన సంపద కల్గినవారు) వుండగా 2017 నాటికి 101, 2022 నాటికి 1665 పెరిగింది. నరేంద్ర మోదీ ప్రధానిగా కేంద్రంలో బి.జె.పి. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గౌతమ్ అదాని, అంబాని సోదరులు, వేదాంత అనిల్ అగర్వాల్ మున్నగు ఆశ్రిత పెట్టు బడిదారులకు వివిధ రూపాలలో వారికి లబ్ధి చేకూర్చే విధానాలు అమలు చేయబడుతున్నాయి.

సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచివేస్తూ, కార్పోరేట్లపైన సంపద పన్ను రద్దు చేయటమేకాక, కార్పోరేట్ ట్యాక్సు 30% నుండి 20%కు తగ్గించడం వల్ల కేంద్రానికి ఏటా రూ.1.45 లక్షల కోట్ల ఆదాయం తగ్గుతుంది. భారత రాజ్యాంగంలో దేశంలోని సహజ వనరులు కొద్దిమంది వద్ద కేంద్రీకృతం కారాదని, మొత్తం ప్రజాబాహుళ్యానికి మేలు చేకూర్చేందుకు, అభివృద్ధిని సాధించేందుకు వినియోగించబడాలి అని స్పష్టంగా ఆదేశిక సూత్రాలలో పేర్కొనబడినప్పటికీ, అందుకు భిన్నంగా మోదీ దత్త పుత్రుడు గౌతమ్ అదానీకి 12 నౌకాశ్రయాలను, 7 విమా నాశ్రయాలను, కోట్లాది టన్నుల బొగ్గు నిల్వ వున్న గనులను కట్టబెట్టింది. "మానిటైజేషన్" పేరు మీద వేలాది కి.మీ. జాతీయ రహదారులను, విద్యుత్ ట్రాన్స్ మిషన్ లైన్లను పవర్ గ్రిడ్తో సహా కార్పోరేట్లకు కారుచౌకగా అందచేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

రైతులు, పేదలు, కుటీర, చిన్న పరిశ్రమల రుణపరిమితి విస్తరించేందుకు 1970లో బ్యాంకుల జాతీయీకరణ జరిగి, అంతకు మునుపుకన్నా ఈ వర్గాలకు కొంత మెరుగైన రీతిలో ఋణాలు అందుతూవున్నా, బ్యాంకులు ఇచ్చు మొత్తం రుణ పరపతిలో సింహభాగం కొద్దిమంది కార్పోరేట్ సంస్థలకే వెళుతూ వుంది. కోట్లాది మంది మధ్య తరగతి ప్రజలు, సీనియర్ సిటిజన్లు, మహిళలు బ్యాంకులో వేసుకున్న డిపాజిట్లు ధనంతో బ్యాంకులు రుణాలు ఇస్తూ వుంటాయి. ప్రభుత్వరంగ బ్యాంకులలో రూ.1,20,88,599 కోట్లు మరియు గ్రామీణ



బ్యాంకు (ఆర్.ఆర్.బి) వద్ద రూ.6,41,599 కోట్లు మరియు ప్రైవేటు బ్యాంకుల వద్ద రూ.72,95,392 కోట్లు డిపాజిట్లు వున్నాయి.

బ్యాంకులలో ప్రజలు దాచుకున్న ధనంపైన అతి తక్కువ వడ్డీ ఇవ్వబడుతూ వుంది. వ్యక్తులు, ట్రస్టులు, ధార్మిక సంస్థలు, కరెంటు అకౌంటులో వుంచిన ధనంపైన వడ్డీ వుండదు. సేవింగ్స్ బ్యాంక్ అకౌంటులో దాచుకున్న ధనం పైన గతంలో 5%గా వున్న వడ్డీని ఇప్పుడు 2.5-3%కు పరిమితమై డిపాజిటర్లకు ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే ఏమాత్రం లాభించని పరిస్థితి. రైతులు, చిరు వ్యాపారులకు చెందిన 29,53,93,001 ఖాతాలకు 13,44,984 రుణాలు ఇవ్వగా ఒక్కొక్క ఖాతాకు 100 కోట్లకు పైన ఋణాలు పొందిన 16,892 ఖాతాలకు రూ.46,55,618 కోట్ల రుణం ఇవ్వబడింది. సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం బ్యాంకులలో దాచు కున్న ధనం తిరిగి సామాన్య ప్రజల ఆర్థిక అవసరాలకు కాకుండా కార్పోరేట్ సంస్థలకు తరలిపోతుందని స్పష్టంగా తెలుస్తూ వుంది. ప్రకృతి వైపరీత్యాల వలన, చీడపీడల వలన పంట నష్టాలు సంభవించి రైతాంగానికి ఒక్క పర్యాయం పంట రుణాలు మాఫీ చేయమని విజ్ఞప్తిచేసినా స్పందించని మోదీ ప్రభుత్వం పదేళ్లలో బడా బాబులకు రూ.14.56 లక్షల కోట్లు రైట్ ఆఫ్ చేసింది. కట్టకల్గిన స్తోమత వుండి ఉద్దేశ పూర్వకంగా ఎగవేస్తున్నారని బ్యాంకులే పేర్కొన్న వారికి రూ.79,000 కోట్లు రైటాఫ్ చేయబడింది.

2014 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకు సగటున సంవత్సరానికి రూ.7,187 కోట్లు రైటాఫ్ చేస్తూ వుండగా, 2023 నాటికి సగటున రూ.1.27 లక్షల కోట్లు మాఫీచేసాయి. అలాగేప్రైవేట్ బ్యాంకులు సగటున ఏటా చేసిన రైటాఫ్లు రూ.4,115 కోట్ల నుండి రూ.84,000 కోట్లకు అనగా దాదాపు 20 రెట్లు పెరిగింది.

ఈ ఋణమాఫీ పొందిన వారిలో 95% మంది గుజరాతీలు. ఇది చాలదన్నట్లు దివాళా పరిష్కారం (IBC% కోడ్) మరియు (NCLT) పరిష్కార పద్దతుల ద్వారా కార్పోరేట్లకు గరిష్ట స్థాయిలో మోడి ప్రభుత్వం లబ్ది చేకూరుస్తూ వుంది. 2016 నుండి 2023 మధ్యకాలంలో దాదాపు రూ.23 లక్షల కోట్ల బకాయిలు వున్న 7,325 కేసులలో దివాళా పరిష్కారంగా రూ.3.86 లక్షల కోట్లు మాత్రమే రాబట్టబడింది.

ఉదాహరణకు వీడియోకాన్ సంస్థ దాని అనుబంధ 12 సంస్థలు కలిసి మొత్తంగా రూ.71,433 కోట్లు బకాయిని, వేదాంత గ్రూపునకు రూ.2,962 కోట్లకు పరిష్కారం అయినది. అనగా బ్యాంకులకు 96% క్షవరం (Hair cut) అయింది. మోడీకి మరొక అత్యంత సన్నిహితుడు అనిల్ అంబానికి చెందిన R.Com సంస్థ రూ.47,124 కోట్లు బకాయి వుండగా ముఖేష్ అంబానీకి రూ.456 కోట్లకే కట్టబెట్టబడింది. ఇంకా పలు కార్పోరేట్ వర్గాలకు లక్షల కోట్ల రూపాయల బాకీలు రద్దు చేయబడుతున్నాయి.

ఈ కారణాల వల్లే సంయుక్త కిసాన్ మోర్చా కార్పోరేట్లను బహిష్కరించాలని పిలుపునిచ్చింది. ఈ విధంగా ప్రజలు దాచుకున్న డిపాజిట్లు చేసిన సొమ్ములో అధికభాగం ఈ కార్పోరేట్లకే వెళుతూ వుండడం వల్ల రైతులు, కౌలు రైతులు, గ్రామీణ పైదలు, బలహీన వర్గాలకు రుణపరపతి సౌకర్యం తగ్గిపోతూ అధిక వడ్డీలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుండి రుణం పొందాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచీల సంఖ్య సగానికి తగ్గింది. తగ్గటమేకాక 1991 వరకు బ్యాంకు రుణాలలో అత్యధిక భాగం చిన్న ఖాతాదారులకే వెళుతూ వుండగా ఆర్థిక సంస్కరణల దరిమిలా అధిక స్థాయిలో రుణాలు పొందిన ఖాతాల సంఖ్య బాగా పెరిగింది.

వ్యవసాయం, అనుబంధ రంగాలకు, చిన్న పరిశ్రమలు, మున్నగు ప్రాధాన్యతా రంగాలకు ఋణం పేరుతో ఇవ్వవలసిన 18% లో ప్రత్యక్ష రుణంగా 13.5% మరియు పరోక్ష ఋణం పేరుతో 4.5% వెళుతూ వుంది. మొత్తం వ్యవసాయ రుణంలో 44% రైతులకు వ్యవసాయ ఋణంగా లభించగా, 56% పరోక్షపు రుణంగా వ్యవసాయాధారిత, ఆహార పరిశ్రమ, విత్తన- పురుగు మందులు షాపులకు మున్నగువాటికి ఇవ్వబడింది.

అంతేకాక వ్యవసాయ ఋణంలో 28% వ్యవసాయం చెయ్యకుండా పట్టణాలు మరియు మెట్రో నగరాలలో వుంటూ వున్న ధనిక రైతులకు వెళ్ళిందే తప్ప కౌలు రైతులలో అత్యధిక శాతం మందికి, సన్నకారు, చిన్న రైతులలో 40% మందికి బ్యాంకుల నుండి సహకారం అందటం లేదన్నది అనుభవమే!

అందువలనే కార్పోరేట్లను బహిష్కరించాలని సంయుక్త కిసాన్ మోర్చా యిచ్చిన పిలుపును (ఆగస్టు 9) జయప్రదం చేయవలసిందిగా యావత్ ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాము.



**-వడ్డే శోభనాద్రీశ్వరరావు**

(దారి దీపం : ఆగస్టు 2024 సంచిక నుండి)

6

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 07, ఆగస్టు 2024

## తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డకు ఆరోగ్యం

● ఎమ్మెల్యే డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, మహానాడు:

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందని, ఈ దృష్ట్యా తల్లులు పౌష్టికాహారాన్ని తీసుకొని పిల్లలకు తల్లిపాలతో వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని తెలుగుదేశం పార్టీ దర్శి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వివరించారు. ఈ మేరకు ఆమె మంగళవారం కురిచేడు దొనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగిన తల్లి పాల వారోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తల్లులు గర్భిణీ సమయంలో ఆ తరువాత పౌష్టికాహారాన్ని తీసుకొని పిల్లలకు తల్లిపాలన ఇవ్వాలని తద్వారా వారు దృఢంగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంతేకాక తల్లులు ఎక్కువగా వాటర్ తీసుకోవాలని సూచించారు.

ఆరోగ్యమైన సమాజం కోసం పౌష్టికాహారాన్ని తీసుకోవడం ముఖ్యమని ఒక డాక్టర్‌గా... ఒక తల్లిగా... చెబుతున్నానని ఎమ్మెల్యే అన్నారు. సమాజం ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది



ప్రజల కోసం నిరంతరం పాటు పడే మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాహిత కార్యక్రమాలను చేపడుతూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కురిచేడు, దొనకొండ మండలం టిడిపి అధ్యక్షులు పిడతల నేమిలయ్య, నాగులపాటి శివకోటేశ్వర రావు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రూ. 23 కోట్లతో 'అవనిగడ్డ'లో అభివృద్ధి పనులు

● ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

అవనిగడ్డ, మహానాడు:

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే అవనిగడ్డ నియోజకవర్గానికి రూ.23కోట్లు మంజూరు చేయించి డ్రైనేజీలు, పంట కాలువలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఇరిగేషన్ డీఈఈ రావెళ్ల రవికిరణ్, డ్రైనేజీ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావులతో కలిసి మంగళవారం వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. మోపిదేవి మండలం కే.కొత్తపాలెం వద్ద ఎనిమిదో నెంబరు పంట కాలువ పనులు, చల్లపల్లిలో 6/1 పంట కాలువ పనులు, ఘంటసాల మండలం దేవరకోట వద్ద చిల్లల వాగు అభివృద్ధి పనులు, ఘంటసాల గ్రామం వద్ద గుండేరు మేజర్ డ్రైనేజీ పనులు, ఘంటసాల గ్రామంలో 3/2 చానల్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఘంటసాల మండల పరిధిలో గత కొన్నేళ్లుగా సమస్యాత్మకంగా ఉన్న గుండేరు మేజర్ డ్రైనేజీ, చిల్లల వాగు మైనర్ డ్రైనేజీ సమస్యలు పరిష్కారం కావడం సంతోషదాయకం అన్నారు. నియోజకవర్గంలోని అన్ని డ్రైనేజీల్లో తూటికాడ, గుర్రపుడెక్క పనులు చేపట్టి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక వర్షాలు పడినా సమస్య రాకుండా పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడే నాటికి ఇరిగేషన్ శాఖలో ఎలాంటి నిధులు లేవని, తాను ప్రత్యేక చొరవ తీసుకొని డ్రైనేజీ, ఇరిగేషన్ పనుల కోసం రూ.23 కోట్లు మంజూరు చేయించి రైతులకు న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అతివృష్టితోపాటు సల్ప వర్షాలకే పంటలన్నీ మునిగిపోయాయని, నాలుగేళ్లుగా తాను గమనించిన సమస్యలన్నీ పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



రానున్న వేసవిలో నియోజవర్గంలోని అవుట్ ఫాల్స్ స్లూయిజులు, లాకులు మరమ్మతులు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా పనులను కాగితాలకే పరిమితం చేయకుండా... తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆచరణాత్మక రూపంలో డ్రైనేజీలు, పంట కాలువలు అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలో ఖచ్చితంగా పారదర్శక పరిపాలన సాగాలని స్పష్టం చేశారని తెలిపారు.

ఈ సందర్భంగా ఘంటసాలలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఇంటి వద్ద చిలకలపూడి రైతులు తమ సమస్య వివరించగా వెంటనే ఉన్నత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఘంటసాల మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, అయినంపూడి భానుప్రకాష్, మేకా బంగారుబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, వేమూరి రమేష్, వేమూరి గోవర్ధన్, గుత్తికొండ వంశీ, తోట్టెంపూడి పెదబాబు, పరిసే చలపతి, గొరిపర్తి సుబ్బారావు, ఏఈలు ప్రసాద్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన

# ఆంధ్రాని ఆదుకోవాలి

● లోక్ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

ఢిల్లీ,మహానాడు:

ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆంధ్రాకి కేంద్రం సాయం చేసి ఆదుకోవాలని, అభివృద్ధిని మెరుగుపరిచేందుకు సహకరించాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ఆర్థిక దుస్థితిని తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేసిందని ఈ పత్రాలను అందజేస్తామని చెప్పారు. మంగళవారం లోక్ సభలో లోక్సభలో ఆర్థిక బిల్లుపై జరిగిన చర్చలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగించారు.

ఏపీ ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతోందని.. కేంద్రమే గట్టెక్కించి ఆదుకోవాలని, ప్రస్తుతం మా ప్రభుత్వం కేంద్రంతో పనిచేయటానికి ఉందని అదనపు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ఖర్చులు రూ.1.64లక్షల కోట్లు కాగా రెవెన్యూ, రూ.1.45లక్షల కోట్లు,, ఈ ఏడాదిలో రూ.19వేల కోట్ల లోటు స్పష్టంగా ఉందని తెలిపారు. రాష్ట్ర అప్పు 2019లో రూ.3.75 లక్షల కోట్లు కాగా అది కాస్తా 2024కి రూ.9.74ల కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వృద్ధిరేటు గణనీయంగా తగ్గిపోయిందని,. ఏపీలో వృద్ధిరేటు 13.5 నుంచి 10.5శాతానికి పడిపోయిందని వెల్లడించారు. వ్యవసాయ వృద్ధిరేటు 16నుంచి 10శాతానికి తగ్గిపోయిందిని అన్నారు. ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడింది..వృద్ధిరేటు దిగజారింది. రాష్ట్ర ద్రవ్యోల్బణం 4.5శాతం నుంచి 6శాతాన్ని మించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కేంద్రం ఏపీపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. రెవెన్యూ




లోటు, అప్పుల భారం నుంచి బయటపడేందుకు చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాన ఆధారితమైన రైతులు, చేనేత కార్మికులను మరింతగా ఆదుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో ఆక్వా ఎగుమతులు 70శాతం ఏపీ నుంచే జరుగుతున్నాయని, ఈ పరిస్థితిలో పీఎం మత్స్య సంపద యోజన కింద ఆక్వా రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఏపీకి ప్రత్యేక నిధులు ఏమీ ఇవ్వడం లేదని, పూర్వోదయ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ.62వేల కోట్లు కేటాయించారని, కోస్తా ప్రాంతంలో పెద్ద రాష్ట్రం గనక ఏపీకి ఎక్కువ నిధులు వస్తాయని స్పష్టం చేశారు.

దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ పై పన్ను విషయంలో పునరాలోచన చేయాలని, ఆరోగ్య, బీమా పాలసీలపై 18శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించాలని, టెక్స్టైల్ రంగాన్ని ఆదుకొనేందుకు పత్తి దిగుమతులపై సుంకాలు తగ్గించాలని అన్నారు.ఆర్థిక రంగం నుంచి గతంలో చెల్లించాల్సిన పన్నుల విధానాన్ని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఢిల్లీ,మహానాడు: ఆంధ్ర అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాలనుండి ప్రాతినిధ్యం వహిస్తున్న గౌరవ పార్లమెంట్ సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారథి గారు, సహచర పార్లమెంట్ సభ్యులు**




## పిల్లల చదువులే కుటుంబానికి ఆస్తి!

● ఎమ్మెల్యే గద్దె రామమోహన్

విజయవాడ, మహానాడు:

పిల్లల చదువులే ఆయా కుటుంబాలకు ఆస్తులని, అటువంటి గొప్ప చదువులను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం విద్యార్థులందరికీ అందిస్తోందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని కృష్ణలంకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథి హాజరైన విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసి, మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు కూడా పుస్తకాలు ఉచితంగా ఇవ్వాల్సిందిగా తాము కోరామని, అందుకు ముఖ్యమంత్రి స్పందించి ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు వివరించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో కళాశాల స్థాయి విద్యను నిర్లక్ష్యం చేశారన్నారు. పీజీ విద్యార్థులు కళాశాలలో చేరే సమయంలో ఫీజు రీయింబర్స్ మెంట్ ఉందని వైఎస్సార్సీపీ ప్రభుత్వం చెప్పిందని, విద్యార్థులు కళాశాలలో చేరిన తర్వాత ఆ సౌకర్యం లేదని చెప్పారని విమర్శించారు. దాంతో ఎంతో మంది విద్యార్థులు ఫీజులు కట్టలేక చదువును మధ్యలోనే ఆపివేశారన్నారు. ఇంటర్ కళాశాల స్థాయిలో మధ్యాహ్న భోజనాన్ని చంద్రబాబు



నాయుడు ప్రభుత్వం అమలు చేస్తే, వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని కూడా కళాశాలల్లో తీసివేశారని చెప్పారు. మళ్ళీ ఆ పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రిని కోరామని, ఆయన కూడా సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, వేములపల్లి రంగారావు, గొరిపర్తి నాగేశ్వరరావు, ప్రిన్సిఫాల్ పెద్దపూడి రవికుమార్, డి.ఇ.ఓ రెడ్డి, దమ్మాపాటి రంగారావు, కొవ్వూరి కిరణ్బాబు, కేశనం భావన్నారాయణ, కొర్రా అప్పన్న, పుప్పాల సుబ్బారావు, వెన్నా శంకర్, రాజమహంతి రమాదేవి, గోగుల రమేష్ తదితరులు ఉన్నారు.

## 5 నెలల బాలుడికి రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్

**బాలుడి తల్లి తండ్రులకు చెక్కు అందజేసిన ఎమ్మెల్యే బండారు**

రావులపాలెం, మహానాడు:

కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం వెధిరేశ్వరం మూలగూడెం కాలనీకి చెందిన ఇళ్ల వెంకటేశ్వరావు, నాగలక్ష్మి దంపతుల అయిదు నెలల కుమారుడు అఖిల్ లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఇందుకు సంబంధించిన వైద్యం అతి ఖరీదు అవడంతో స్థానిక నాయకులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకుని వెళ్ళారు. దీంతో ఆయన తక్షణం స్పందించిన సీఎం రిలీఫ్ ఫండ్కు సిఫార్సు చేయగా ఆ బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వెధిరేశ్వరంలోని అఖిల్ తల్లిదండ్రులకు మంగళవారం అందజేశారు. తమ కుమారుడుకి ఖరీదైన వైద్యానికి ఎమ్మెల్యే బండారు చేసిన సాయం ఎప్పటికీ మరువలేవని అఖిల్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు



తెలిపారు.

ఎమ్మెల్యే వెంట బొక్క దుర్గ ప్రసాద్, చిట్టూరి శ్రీను, కుదుపూడి ఏడుకొండలు, రాయుడు సత్యనారాయణ, మట్టపర్తి సత్య నారాయణ, మట్టపర్తి చంద్రరావు, కుదుపూడి వెంకట రమణ, తదితరులు ఉన్నారు.

## 'నెల్లూరు'లో శరవేగంగా అభివృద్ధి పనులు

● రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి

నెల్లూరు రూరల్, మహానాడు:

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆ వివరాలివి. 20వ డివిజన్, న్యూ కావేరి అవెన్యూ లో షుమారు 10 లక్షల రూపాయల నిధులతో



కల్వర్టు పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20వ డివిజన్‌లో కరెంటు సమస్యలపై అధ్యాయనం చేసి, కరెంటు సమస్యలు లేకుండా చేస్తాం. 20వ డివిజన్ అభివృద్ధికి మరో 2 నెలల్లో 40 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తాం. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వాడవాడలా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యేగా నా లక్ష్యం ఒక్కటే. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడమేనని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కంటే సాయి బాబా, స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్, టీడీపీ నాయకులు దారా మల్లి, షేక్ ఖాదర్ బాషా, పోతురాజు రవి, దిలీప్ రెడ్డి, ఎం.శ్రీనివాసులు, పి.డేవిడ్ రాజా, దామోదర్ (పిచిరెడ్డి), రవీంద్ర రెడ్డి, మురళి రెడ్డి, నారాయణ, కిష్టయ్య, రత్నయ్య, వెంకటేష్, నవీన్, బాల సిద్దయ్య, చేజర్ల కవిత, పద్మజ యాదవ్, అల్లం లక్ష్మి, శాంతి, ఎమ్.సి. సుబ్రహ్మణ్యం, జి.డేవిడ్, దాసు, చికవోలు శ్రీనివాసులు, మధుసూధన రావు తదితరులు పాల్గొన్నారు.

## సైనికుల ఆధీనంలో బంగ్లాదేశ్

హైదరాబాద్,మహానాడు:

బంగ్లాదేశ్ రాష్ట్రంలో నెలల తరబడి నిరసనలు.. ఆందోళనలతో రగిలిపోయిన రచ్చలో వందలాది మంది మృతి. కొన్నాళ్లుగా రిజర్వే షన్ల గొడవతో అట్టుడికిన బంగ్లాదేశ్ చివరకు సైనిక పాలనలోకి వెళ్లిపోయింది. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హాసీనా గద్దె దిగాల్సి వచ్చింది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొన్ని నెలల క్రితం శాంతియుతంగా మొదలైన నిరసనలు.. ఊహించని పరిణామాలకు దారితీశాయి. దేశవ్యాప్తంగా చెలరేగిన హింసాత్మక ఘటనలతో షేక్ హాసీనా ప్రభుత్వం



వణికిపోయింది. వందలాది మంది ప్రాణాలు కోల్పోవడంతో చివరకు దేశ ప్రధాని గద్దెదిగాల్సి వచ్చింది. కొన్ని నెలలుగా జరుగుతోన్న ఆందోళన.. రెండు, మూడ్రో జుల నుంచి మరింత హింసాత్మకంగా మారాయి. ఏకంగా ప్రధాని ఇంటిని ముట్టడించారు ఆందోళన కారులు. పరిస్థితి చేయిదాటిపోవడంతో చివరకు షేక్ హాసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశారు. తన సోదరి షేక్ రెహానాతో కలసి ఆర్మీ హెలికాప్టర్‌లో దేశంవిడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు.

### 45 నిమిషాల గడువు

పరిస్థితులు ఆందోళనకరంగా మారడంతో షేక్ హాసీనాను ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఆర్మీ 45 నిమిషాల గడువు పెట్టినట్టు తెలుస్తోంది. అంతే కాదు భద్రతా కారణాల దృష్ట్యా దేశం వెడిచి వెళ్లాలని చెప్పినట్లు సమాచారం. అందుకే ప్రధాని పదవికి రాజీనామా చేయగానే



ఆమె భారత్‌కు చేరుకున్నారు. యూపీలోని ఘజియాబాద్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్న షేక్ హాసీనా లండన్‌కు వెళ్లారు. షేక్ హాసీనా బంగ్లా దేశ్‌ను వదిలివెళ్లిన తర్వాత ఆమె ఇంట్లోకి చొరబడ్డారు ఆందోళనకారులు.

హాసీనా ఇంట్లో ఉన్న ఫర్నీ చర్ ఇతర వస్తువులను పగలగొట్టి.. కొన్ని వస్తువులను ఎత్తుకెళ్లారు. మరోవైపు బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభంతో భారత్ అలర్ట్ అయింది. బంగ్లాదేశ్ బార్డర్‌లో హై అలర్ట్ ప్రకటించి సరిహద్దు గ్రామాల ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఇప్పటికే బీఎస్ఎఫ్ డీజీ కోల్‌కతాకు చేరుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు రెగ్యులర్‌గా నడిచే అన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఇండియన్ రైల్వే ప్రకటించింది. కరోనా తర్వాత బంగ్లా దేశ్ లో పరిస్థితులు దిగజారు తూ వచ్చాయి. యుక్రెయిన్ వివాదంతో బంగ్లాదేశ్ దిగు మతి చేసుకునే ఇంధనం నుంచి నిత్యావసరాల వరకు అన్నీ ధరలు 20శాతం వరకు పెరిగాయి. యువతకు ఉద్యోగాలు లేవు. కనీసం రోజు గడవ డమే కష్టంగా మారింది. ఇవే విద్యార్థులను విధుల్లోకి వచ్చి ఆందోళన చేయడానికి కారణమయ్యాయి. స్టూడెంట్స్‌లో ఉన్న ఆగ్రహా వేశాలను బంగ్లాదేశ్‌లోని అపోజిషన్ పార్టీ ..బంగ్లా దేశ్ నేషనలిస్ట్ పార్టీ క్యాష్ చేసుకుంది.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 07, ఆగస్టు 2024

## జాయింట్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే అరవింద బాబు



**పల్నాడు, మహానాడు:**
పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సూరజ్ కుమార్‌ను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాలో అభివృద్ధి, సమస్యల గురించి చర్చించారు. నియోజకవర్గంలో సాగు, మంచి నీటి విషయంలో ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని విన్నవించారు.ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని, ప్రభుత్వపరంగా మద్దతు ఇవ్వాలని కోరారు. పేటలో ప్రధానంగా వ్యాధుల విజృంభణ ఎక్కువగా ఉన్నందున అధికారుల్ని అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే విన్నవించారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## 15న రాష్ట్ర వ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్లు ప్రారంభం

- మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ

**అమరావతి, మహానాడు:**
రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్,డైరెక్టర్ హరి నారాయణన్,ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆ వివరాలివి. అన్న క్యాంటీన్లు ఏర్పాటు,డ్రైన్ లలో పూడిక తొలగింపుపై కమిషనర్లకు పలు సూచనలు..

పలు ప్రాంతాల్లో క్యాంటీన్ భవనాలు నిర్మాణం జరుగుతున్న తీరును పరిశీలన.. డ్రైన్‌లలో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు. ఈ నెల 15న రాష్ట్రంలో 100 అన్న క్యాంటీన్‌లు ప్రారంభిస్తున్నాము. 33 మున్సిపాలిటీల్లో 100 క్యాంటీన్లు ఏర్పాటు. రాబోయే వారం రోజులు అన్న క్యాంటీన్ లపై కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. క్యాంటీన్ భవనాల్లో కిచెన్ ఏర్పాటు చేసే టీమ్ తో సమన్వయం చేసుకోవాలి.

## స్టేడియం నిర్వహణ ఇలాగేనా?

- కోడెల స్టేడియంలో సదుపాయాలపై ఎమ్మెల్యే చదలవాడ అసహనం

**నరసరావుపేట, మహానాడు:**
నరసరావుపేట పట్టణంలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో వర్షం నీరు నిలిచిపోవడం పై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అసహనం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఉదయం స్టేడియంను



పరిశీలించారు. నీరు నిలిచిపోవడం చూసి అధికారులతో మాట్లాడారు. అధికారులను వెంట బెట్టుకుని స్టేడియం మొత్తాన్ని పరిశీలించారు.స్టేడియంలో వాతావరణం ఇలా ఉంటే క్రీడాకారుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తక్షణమే వర్షం నీటిని బయటకు పంపించేలా ఏర్పాట్లు చేయాలని, అదే సమయంలో నీరు నిలిచే ప్రాంతాలను చదును చేయాలన్నారు. గత ప్రభుత్వం క్రీడాకారుల గురించి కనీసం పట్టించుకోకపోవడం కారణంగానే ప్రస్తుతం ఇలాంటి దుస్థితి దాపురించిందన్నారు. క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే చదలవాడ హామీ ఇచ్చారు.

## అర్చకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**గొల్లపూడి, మహానాడు:**
అర్చకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం గొల్లపూడి దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం లో జరిగిన సమావేశం లో మంత్రిని ఆంధ్రప్రదేశ్ అర్చక ఐక్య వేదిక (అర్చక జేఏసీ)ముఖ్య నాయకులు కలిసి వారి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు నేతృత్వంలో రాష్ట్రంలో నిర్వీర్యం అయన అన్నీ వ్యవస్థలని గాడిలో పెట్టేందుకు అవిరళ కృషి జరుగుతోందన్నారు.

రాష్ట్రంలో అర్చకులు ఎదురుకుంటున్న దీర్ఘకాలిక సమస్యలు అర్చకుల



వంశపారంపర్య హక్కు జీవో ఎంఎస్ 439 అమలు, వేతన అర్చకులు కై 65 (A) అమలు, గత ప్రభుత్వం లో అమలుకు నోచుకోని అర్చక వెల్ఫేర్ పథకాలు, కనీస వేతనాలు, అర్చకులకు హెల్త్ కార్డులు తదితర సమస్యల పారష్కారానికి కృషి చేస్తామన్నారు, ఈ సమావేశంలో దేవదాయ కమిషనర్ ఎస్. సత్య నారాయణ, అధికారులు, అర్చక జేఏసీ నాయకులు శ్రీకంఠం నందీశ్వర్, ఎం.ఏ.శేషాచార్యులు, యనమండ్ర సత్య సీతారామ శర్మ (మురమళ్ళ రాంబాబు) జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి, కొత్తలంక మురళీ కృష్ణ, ఏ.అక్షయ లింగశర్మ, కె.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు,సమావేశం అనంతరం జేఏసీ నాయకులు మంత్రి ని సత్కరించారు.

## దర్శి అభివృద్ధిపై దృష్టిపెట్టండి

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి సీఎం చంద్రబాబు భరోసా



**దర్శి, మహానాడు:**
అమ్మా లక్ష్మీ... మీ రాజకీయ భవిష్యత్ నాకు వదిలేయండి. మిమ్మల్ని రాజకీయంగా ఎలా పైకి తేవాల్నో నేను చూసుకుంటాను. ప్రజాసేవలో నిమగ్నమై పనిచేసిన ప్రతీ ఒక్కరికీ టీడీపీలో మంచి భవిష్యత్తు ఉంటుంది కనుక ముందు మీరు దర్శి నియోజకవర్గ అభివృద్ధి పై దృష్టి పెట్టండి.. ఏం కావాల్నో అడగండి. మీ నియోజకవర్గాన్ని మీరు అభివృద్ధి పథంలో నిలిపి ప్రజలకు చేరువుఅవ్వండి... అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దర్శి టీడీపీ ఇంఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి భరోసానిచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ఆమె ముఖ్యమంత్రిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి దర్శి అభివృద్ధి ప్రణాళిక పై ఒక అంచనా నివేదిక అందించారు. ఆమెతోపాటు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, డాక్టర్ వెంకటేశ్వరరావులు దర్శి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి పై చంద్రబాబునాయుడుతో దాదాపు 30 నిముషాలపాటు చర్చించారు.

దర్శి ప్రాంతంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని..శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ నిమిత్తం దొనకొండ ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ వంటి జోన్ ఏర్పాటు మంచిదని చంద్రబాబు దృష్టికి తెచ్చారు. దర్శి పట్టణంలో అభివృద్ధి మౌలిక సదుపాయాలు కల్పన, రోడ్లు, డ్రెయినేజీ విస్తరణ, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి, డిగ్రీ కాలేజీ శాశ్వత భవనాలు, సాగర్ కాలువల మరమ్మతులు, అమృత పథకం ద్వారా ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన నీటి పంపిణీ తదితర అంశాలపై సర్వే అంచనాలను గొట్టిపాటి సీఎం దృష్టి కి తీసుకెళ్ళి చర్చించారు.

ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఎన్నికల తర్వాత కూడా ఒక డాక్టర్‌గా, మహిళా నాయకురాలిగా దర్శి నియోజకవర్గంలో చురుగ్గా పనిచేస్తున్నట్లు తనకు సమాచారం ఉందన్నారు. అతి తక్కువ కాలంలో ప్రజల అభిమానాన్ని చూరగొని టీడీపీ పార్టీ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా అందరూ పనిచేయాలని ఆమేరకు ముందుకు పోవాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి సీఎం భరోసానిచ్చారు. కూటమి పక్ష నేతగా ఇకనుంచి ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి దర్శి నియోజకవర్గ అభివృద్ధిని తీర్చిదిద్దాలన్నారు. ఈమేరకు ముఖ్యమంత్రిచంద్రబాబుకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కుటుంబం కృతజ్ఞతలు తెలిపి.. తమ కిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామ న్నారు.

## వాహనాలన్నీ కండీషన్‌లో ఉండాలి



- నగర కమిషనర్ హరికృష్ణ ఆదేశం

**గుంటూరు, మహానాడు:**
నగరపాలక సంస్థకు చెందిన వాహనాలు అన్నీ కండీషన్‌లో ఉండాలని, వాహనాల స్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ (ఎఫ్ఏసి) ఎస్.హరి కృష్ణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ స్థానిక కెవిపి కాలనీలోని నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్ ని, ఏటుకూరు రోడ్ లోని కంపోస్ట్ యార్డ్, వర్మి కంపోస్ట్ యూనిట్ లను, చుట్టగుంట జంక్షన్, జిటి రోడ్, శ్రీనివాసరావుతోట తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత వెహికిల్ షెడ్ ని పరిశీలించి, ప్రస్తుతం ఉన్న వాహనాలు, వాటిలో మరమత్తులకు గురైనవాటి, వినియోగంలో లేని వాహనాల వివరాలు అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ ప్రతి వాహనం కండీషన్ లో ఉండేలా షెడ్ పర్యవేక్షణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మరమత్తులకు గురైన వాహనాలను వెంటనే మరమత్తు చేసేలా కార్యాచరణ ఉండాలని, షెడ్ లోని వాహనాల స్థితి పై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి వాహనంకు జిపిఎస్ ఉండాలన్నారు.

ఏటుకూరు రోడ్‌లోని కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించి, నగరంలో నుండి వచ్చిన చెత్తను డంప్ చేయడం జరుగుతుందని యార్డ్ లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఏఈని ఆదేశించారు. వర్మి కంపోస్ట్ యూనిట్‌ని పరిశీలించి యూనిట్ పరిమాణం పెంచాలని, నగరంలోని నగర పాలక సంస్థ పార్క్‌ల్లో ఎరువుని వినియోగించడానికి సరిపడా సిద్దం చేయాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, నగరంలో గార్బేజ్ వల్నర్బుల్ పాయింట్స్ ఉండకుండా సచివాలయాల వారీగా కార్యదర్శులే భాధ్యత తీసుకోవాలన్నారు. నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేస్తే జీరో గార్బేజ్ వల్నర్బుల్ పాయింట్స్ సాధ్యమవుతుందన్నారు.

పర్యటనలో ఎంహెచ్ఓ మధుసూదన్, వెహికిల్ షెడ్ డిఈఈ శ్రీధర్, ఎస్.ఎస్. ఆనంద కుమార్, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్లు రత్నం, ఏడు కొండలు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15నుంచి రూ.5కే భోజనం

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:** ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం మేరకు ఈ ఆగస్టు 15వ తేదీ నుంచే వినుకొండలో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తున్నామని, పేదలకు రూ.5కే కడుపునిండా భోజనం అందిస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక తల్లి పిల్లల ఆస్పత్రి వద్ద అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. భవనం తాజా పరిస్థితి, ఫర్నిచర్, ఐఓటీ పరికరాల ఏర్పాటు విషయమై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

భోజనం చేసేవారి కోసం టేబుళ్లు, మంచినీటి సౌకర్యం, పంకాలు, విద్యుత్ , రంగుల పనులు తుది దశకు చేరాయన్నారు పూర్తి సౌకర్యాలతో అనుకున్న ప్రకారమే అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తెదేపా గత ప్రభుత్వంలోనే చంద్రబాబు ఈ క్యాంటీన్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలమంది పేదల ఆకలి తీర్చితే... వాటిని కూడా స్వార్థ, కక్షపూరిత రాజకీయాలకు బలిపెట్టిన జగన్ రెడ్డి అని మండి పడ్డారు. అన్న క్యాంటీన్లకు వైఎస్ ఫొటోలు పెట్టి మరీ వాటిని మూసేశారని, రూ.5కే కడుపునిండా భోజనం తింటున్న పేదల పొట్ట కొట్టి జగన్ తన కడుపు మంట చల్లార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




గతంలో అక్షయపాత్ర వారు గతంలోనూ అన్న క్యాంటీన్లను బాగా నిర్వహించారని, ఆహార నాణ్యతతో పాటు పరిశుభ్రత కూడా చాలా బాగా నిర్వహించారన్నారు. ఈసారి కూడా వారినే బాధ్యత తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతో నాణ్యతా ప్రమాణాలతో పౌష్టిక ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమాలు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కొని జేటి నాగశ్రీను రాయల్, టిడిపి నాయకులు షమీంఖాన్, పఠాన అయిబ్ ఖాన్, పత్తి పూర్ణచంద్రరావు, పీవీ సురేష్ బాబు, అజీజ్, కర్నాటి వెంకటరెడ్డి, పల్ల మీసాల దాసయ్య, గంధం సుబ్బారావు,చికెన్ బాబు, గుంజు కాలింగ్ రాజు, పుండ్ల నరసింహారావు, పలువురు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టి ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు

**అమరావతి, మహానాడు:**
రాష్ట్రంలో అందుబాటులో ఉండే ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ఈప్రభుత్వ ప్రధమ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలోని మంగళవారం మంత్రి తన ఛాంబరులో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం సాగునీటి వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కాలువలు, డ్రైన్లలో పూడికతీత చేపట్టలేదని దానివల్ల నేడు నీటి ప్రవాహానికి అనేక ఇబ్బందులు ఎదురవు తున్నాయని తెలిపారు. నేడు రాష్ట్రంలోని జలశయా లన్నీ జలకళను సంతరించుకుని కళకళలాడు తున్నాయని అన్నారు. పోతిరెడ్డిపాడు నుండి నీటిని తీసుకుని శ్రీశైలం కుడి కాలువ, హంద్రీనీవా, కెసి కాలువల ద్వారా రాయ లసీమ సాగు, మంచినీటి అవసరాలను తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటు న్నట్టు చెప్పారు. వరదనీరు వృథాగా సముద్రంలోనికి పోకుండా అన్ని రిజర్వాయర్లను పూర్తిగా నీటితో నింపాలని జలవనరుల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రి రామానాయుడు మీడియాకు వివరించారు.

ప్రకాశం బ్యారేజి నుండి కుడి, ఎడమ కాలువల ద్వారా కృష్ణా డెల్టాకు పూర్తిగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి రామానాయుడు చెప్పారు. సాగునీటి ఎద్దడిని అధికమించేందుకు వీలుగా ఖరీఫ్ పంటను సాధ్యమైనంత ముందుగా వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, పట్టిసీమ నుండి నీటిని తీసుకుని కృష్ణా డెల్టాకు పూర్తి స్థాయిలో నీటిని అందించడం జరుగుతోందని చెప్పారు. వ్యవ సాయం, అభివృద్ధి సంక్షేమం ఈప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశాలుగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు.



గత ప్రభుత్వం సాగునీటి వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి కాలువలు, డ్రైన్లలో తట్టమట్టి కూడా పూడిక తీయకపోవడంతో నేడు సాగునీటి పారుదలకు అనేక ఇబ్బందులు ఎదురువు తున్నాయని మంత్రి రామానాయుడు చెప్పారు. అదే విధంగా లాకులు, షట్టర్లకు కనీసం గ్రీసు కూడా పూయక పోడవంతో అవన్నీ దెబ్బతిని పనిచేయని పరిస్థితుల్లో ఉన్నాయని అన్నారు. అదే విధంగా ఏటిగట్లు, కాలువగట్లు బలహీనమై గండ్లుపడే పరిస్థితులు నెలకొన్నాయని అలాంటి వన్నీ గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. జిల్లా కలక్టర్ నేతృత్వంలో రెవెన్యూ,పోలీస్, మంచినీటి సరఫరా, జలవనరుల శాఖ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి ఏటిగట్ల పటిష్ఠతకు చర్యలు తీసుకోవాలని చెప్పామన్నారు. ఎస్ఇ మొదలు ఎఇ వరకూ అధికారులు, సిబ్బంది అంతా దీనిలో చురుగ్గా పని చేయలని ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రి చెప్పారు.

### కృష్ణా జిల్లా ఎస్ఇ ప్రసాద్ బాబు సరెండర్

ప్రకాశం బ్యారేజి నుండి కృష్ణా డెల్టాలోని కుడి, ఎడవకాలువలకు పూర్తి స్థాయిలో నీటిని అందించాలని ఆదేశించగా కృష్ణా జిల్లా ఎస్ఇ ప్రసాద్ బాబు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇఎన్సికి సరెండర్ చేసినట్టు మంత్రి రామానాయుడు చెప్పారు. గత 31న ఎస్ఇలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కృష్ణా డెల్టాకు కృష్ణానది పరివాహక ప్రాంతం, పట్టిసీమ, ప్రకాశం బ్యారేజిలో అందుబాటులో ఉన్న నీటిలో 16వేల 500 క్యూసెక్కుల నీటిని కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీటికి సరఫరా చేయాలని ఆదేశించామని తెలిపారు. అదే సమయంలో పులిచింతల నుండి నీటిని డ్రా చేసుకోవాలని చెప్పగా ఈనెల 1వతేదీన 14వేల క్యూసెక్కులు, 2న 15వేలు, 3న 12వేలు, 4న 10వేలు, 5వతేదీన 11వేల క్యూసెక్కుల నీటిని కాలువల ద్వారా విడుదల చేశారని వివరించారు. సాగునీటి విడుదలలో ఎస్ఇ పూర్తిగా నిర్లక్ష్యం వహించారని గమనించి ఇఎన్సికి సరెండర్ చేసినట్టు స్పష్టం చేశారు.

08

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 07, ఆగస్టు 2024

## జర్నలిస్టులకు గుర్తింపు కార్డుల నిరాకరణ చెల్లదు

- **అక్రిడిటేషన్ రూల్స్‌లో కొంతభాగాన్ని కొట్టిసిన హైకోర్టు**



**హైదరాబాద్, మహానాడు:**
చిన్న పత్రికల్లో పనిచేసే జిల్లా, నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు కార్డు) ఇవ్వకుండా దూరం పెట్టడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ – 2016లోని షెడ్యూల్ 'ఈ' ని కొట్టేస్తూ తాజాగా తీర్పు ఇచ్చింది. చిన్న వార్తాపత్రికలను నాలుగు విభాగాలుగా విభజించడం చెల్లదని పేర్కొంది. 2016లో జీవో 239 ద్వారా అప్పటి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సవాల్ చేస్తూ మహబూబ్‌నగర్‌కు చెందిన తాటికొండ కృష్ణ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. 'చిన్నపత్రికల్లో పనిచేసే జర్నలిస్టులను ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా ఎందుకు విభజించారో సరైన వివరణ లేదు. తగిన వివరణ, సమర్థన లేకుండా మిగతావారితో సమానంగా గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం చెల్లదు. రెండు నెలల్లో పారదర్శక, హేతుబద్ధమైన ప్రాతిపదికన మార్గదర్శకాలు రూపొందించాలి' అని ఆదేశించింది.



## రాజకీయ లబ్ధి కోసమే జగన్ పిటిషన్

**- హెూంమంత్రి వంగలపూడి అనిత**

**మంగళగిరి,మహానాడు:**
రాజకీయ లబ్ధి కోసమే వైఎస్ జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని హెూంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మాజీ సీఎం జగన్ కు సరిపడా భద్రత కల్పిస్తున్నామన్న ఆమె.. 980 మందితో భద్రతా అవసరమా..? అని ప్రశ్నించారు.

మంగళవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆమె అనంతరం మీడియాతో మాట్లాడారు. భద్రత పేరుతో జగన్ రాజకీయ లబ్ధి కోసం ఆరాటపడుతున్నారని హెూం మంత్రి అనిత ఎద్దేవా చేశారు.

తనకు వస్తున్న ఫిర్యాదుల్లో చాలా వరకు గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దోపిడీ, దాడులు, అక్రమాలకు సంబంధించినవే ఉంటున్నాయన్నారు. జగన్ బాధితులు భారీ సంఖ్యలో పులివెందులు నుంచి ప్రజాదర్బార్‌కు వస్తున్నారని ఆమె వెల్లడించారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ బాధితులు ఫిర్యాదులకు వస్తుండడం గమనార్హమన్నారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని హెూం మంత్రి స్పష్టం చేశారు.

## సంకల్ప బలమే ప్రధానం

**- భారత అంధుల క్రికెట్ జట్టుతో సీఎం రేవంత్ రెడ్డి**

**న్యూయార్క్,మహానాడు:**
జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా, లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్ప బలం మనలో ఉండటం ప్రధానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అమెరికా





పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి న్యూయార్క్ నగరంలో భారత అంధుల క్రికెట్ జట్టు క్రీడాకారులను కలుసుకున్నారు.
వారిని కలుసుకున్న సందర్భం తనకు లభించిన ఒక అమూల్యమైన అవకాశంగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. వారితో ఆప్యాయంగా కొద్దిసేపు ముచ్చటించారు. జీవితంలో ఎలాంటి సవాళ్లయినా ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని వారి నుంచి నేర్చుకోగలమన్నారు. వారిలోని స్ఫూర్తిని అభినందిస్తూ వారికి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.



**రవీంద్రభారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన గద్దర్ ప్రథమ వర్ధంతి సభకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. గద్దర్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన డిప్యూటీ సీఎం**

## లేఅవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులు సరళీకృతం

- **మీడియా సమావేశంలో మంత్రి నారాయణ**

**విజయవాడ, మహానాడు:**
రాష్ట్రంలో లేఅవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులను నిబంధనలను సరళీకృతం చేస్తామని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఇదే సమయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేసారు. రాష్ట్రంలో పలు బిల్డర్ల అసోసియేషన్ ప్రతినిధులతో విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో మంగళవారం మంత్రి నారాయణ సమావేశం నిర్వహించారు. సీఆర్డీయే కమిషనర్ కాటంనేని భాస్కర్, అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థ సారధితో పాటు క్రెడాయ్, నరెడ్కో, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అసోసియేషన్‌ల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు..

2014 నుంచి 2019 వరకూ బిల్డర్లకు స్వర్ణ యుగంగా ఉందని... కానీ గత ప్రభుత్వం తీరుతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మళ్లీ రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు వచ్చేలా నిర్ణయాలు తీసుకోవాలని అసోసియేషన్ల ప్రతినిధులు కోరారు. నాలా టాక్స్,వేకెంట్ ట్యాక్స్,ఫైర్ అనుమతులు, ఎయిర్ పోర్ట్, టీడీఆర్ బాండ్ల విషయాల్లో తమకు ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. ఆన్ లైన్ అనుమతుల జారీలో ఉన్న సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడారు.

టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా నిబంధనల జారీని సరళీకృతం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు మంత్రి నారాయణ..అనుమతుల విషయంలో ఇతర రాష్ట్రల్లో అమలవుతున్న నిబంధనలను అధ్యయనం చేసేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అధికారుల బృందాలను పంపిస్తున్నామన్నారు...టౌన్ ప్లానింగ విభాగంపై సీఎం చంద్రబాబు స్పెషల్ డ్రైవ్ చేయాలని తనకు చెప్పారన్నారు. ఇప్పటికే నెల్లూరు కార్పొరేషన్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు..ఇకపై



ప్రతివారం ఒక మున్సిపాల్టీలో టౌన్ ప్లానింగ్ దరఖాస్తుల పరిష్కారానికి డ్రైవ్ చేస్తామన్నారు..బిల్డర్లకు రెవెన్యూ పరమైన అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నందున టౌన్ ప్లానింగ్ విభాగాన్ని రిజిస్ట్రేషన్ విభాగంతో అనుసంధానం చేస్తామని చెప్పారు..ఇప్పటికే దీనికి సంబంధించి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తో చర్చించినట్లు మంత్రి తెలిపారు. రెండు శాఖలను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిబంధనలు సరళీకృతం చేస్తామని. ఇదే సమయంలో రూల్స్ ను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు...

### అనధికార లేఅవుట్లపై స్పెషల్ ఫోకస్

రాష్ట్రంలో నిబంధనలకు విరుద్దంగా కొంతమంది లేఅవుట్ల ను నిర్మిస్తున్నారని మంత్రి తెలిపారు. ఇలాంటి చోట్ల ప్లాట్లను కొనుగోలు చేయడం,భవన నిర్మాణాలు చేయడం ద్వారా ప్రజలు మోసపోతున్నారని చెప్పారు.. అందుకే అనధికార లేఅవుట్ల సర్వే నెంబర్లను పేపర్ లు,టీవీల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు... ఆయా సర్వే నెంబర్లు రిజిస్ట్రార్ ఆఫీస్ కు ఇవ్వడం ద్వారా ప్లాట్స్ కొనుగోలు చేయాలనుకునే వారికి పూర్తి వివరాలు తెలుస్తాయి..దీనికోసం రాబోయే మూడు నెలల్లో ప్రత్యేక వెబ్ సైట్ రూపకల్పన చేస్తున్నామన్నారు.

### రేపటి నుంచి అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు

అమరావతిలో దట్టంగా పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్ పనులు రేపటి నుంచి ప్రారంభం చేస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు..మొత్తం 58 వేల ఎకరాల్లో ఉన్న తుమ్మ చెట్లు,ముళ్ల కంపలను నెలరోజుల్లోగా తొలగించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

దీనిద్వారా భూములు కేటాయించిన వారికి తమ స్థలంపై అవగాహన వస్తుందన్నారు..మొత్తం 99 డివిజన్స్‌లో ఒకేసారి పనులు ప్రారంభం అవుతాయన్నారు.

### ఆర్ - 5 జోన్ వారికి సొంత ప్రాంతాల్లో ఇళ్లు

రాజధానిలోని ఆర్ – 5 జోన్ లో గతంలో స్థలాలు పొందిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు..ఎవరికైతే అక్కడ స్థలాలు కేటాయించారో వారిని గుర్తించి వారివారి సొంత ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వడం లేదా టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు..సీఆర్డీఏలో లబ్దిదారులు ఉంటే వారికి అక్కడే ఇళ్లు కేటాయిస్తామన్నారు.

## హసీనా ప్రభుత్వం కూల్చివేత

# వెనుక ఎవరున్నార్రు?

బంగ్లాదేశ్ లో నెలకొన్న రాజకీయ అస్థిరత ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. అక్కడ నెలకొన్న పరిస్థితులను ప్రపంచవ్యాప్తంగా దేశాలు పరిశీలిస్తున్నాయి. ముఖ్యంగా ఆ దేశానికి సరిహద్దులో మన దేశం కూడా అప్రమత్తమైంది. ఆదేశంతో పంచుకునే సరిహద్దుల వెంట భద్రతను కట్టుదిట్టం చేసింది.

చొరబాట్లను నిరోధించేందుకు భద్రతా దళాలు నిరంతరం పహారా కాస్తున్నాయి. మరోవైపు అశాంతిని రగిలించే వీడియోలను, పోస్ట్ లను సోషల్ మీడియాలో అప్లోడ్ చేయొద్దని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దానివల్ల బెంగాల్ రాష్ట్రంలో అశాంతి రగిలే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ఈ నేపథ్యంలో హసీనా ప్రభుత్వం కూల్చివేత వెనుక ఎవరు ఉన్నారనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ ప్రశ్నకు గత మే నెలలో హసీనా చేసిన ఒక ప్రకటన సంచలన సమాధానంగా నిలుస్తోంది. ఇదే సమయంలో ఆమె ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు ఏకంగా అగ్రరాజ్యమే రంగంలోకి దిగిందని వార్తలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అందువల్లే ఆమె కట్టుబట్టలతో దేశం విడిచి వెళ్లిపోవాల్సి వచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి.

కొన్ని నెలల క్రితమే హసీనా పరోక్షంగా అటువంటి సంకేతాలు ఇచ్చారని ప్రస్తుతం జరుగుతోంది. అమెరికాతో షేక్ హసీనా ప్రభుత్వం సన్నిహిత సంబంధాలను కొనసాగించకపోవడం వల్లే ఇంతటి ఉత్పాతం జరిగిందనే వాదనలు లేకపోలేదు. అగ్రరాజ్యం ఆగ్రహానికి గురవడం వల్లే.. హసీనా తన పదవిని కోల్పోయారని ప్రచారం జరుగుతోంది.


ఈ ఏడాది జనవరిలో బంగ్లాదేశ్లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలను బంగ్లాదేశ్ ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ బహిష్కరించింది. ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరగలేదని, ఇటువంటి ఎన్నికలను సిగ్గుమాలిన వ్యవహారంగా అభివర్ణించింది.

అదే సమయంలో బంగ్లాదేశ్లో జరుగుతున్న పోలింగ్, ఇతర అంశాలను పరిశీలించేందుకు అమెరికా, రష్యా, కెనడా, ఓఐసి, అరబ్ దేశాల నుంచి పార్లమెంట్ పర్యవేక్షకులు వచ్చారు. ఎన్నికలు జరిగిన విధానాన్ని పరిశీలించారు. పోలింగ్ సాఫీగా జరిగినట్టు వారు వివరించారు.

అయితే ఇందులో అమెరికా మాత్రం భిన్నంగా స్పందించింది. ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదని, పారదర్శకతకు పాతరవేశారని అమెరికా విదేశాంగ శాఖ ఆరోపించింది. ఇది సహజంగానే హసీనా ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ఆమె ఆ ఎన్నికల్లో నాలుగోసారి ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు.

### - అమెరికా హస్తం?

అమెరికా విదేశాంగ శాఖ చేసిన వ్యాఖ్యల తర్వాత హసీనా కొన్ని రోజులపాటు మౌనాన్ని ఆశ్రయించారు. అయితే ఇటీవల మే నెలలో ఆమె ఒక సంచలన ప్రకటన చేశారు. బంగ్లాదేశ్లో వైమానిక స్థావరం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇస్తే.. నన్ను ప్రధానమంత్రిగా



ఎన్నికయ్యేందుకు చూస్తామని అమెరికా ఆఫర్ ఇచ్చిందని సంచలన ఆరోపణ చేశారు.

ఈ ఆరోపణ సహజంగానే ప్రపంచం దృష్టిలో పడింది. అమెరికాను ద్వేషించే దేశాలకు ఆయుధంగా మారింది. హసీనా నేరుగా అమెరికా పేరు బయటకు చెప్పకపోయినప్పటికీ.. ఆ దేశం అమెరికా అయి ఉంటుందని ప్రపంచ దేశాలు అంచనా వేశాయి.

" నేను పరిపాలిస్తున్న దేశంలో వైమానిక స్థావరం ఏర్పాటు చేసుకుంటామని ఒక దేశం నన్ను సంప్రదించింది. ఇందుకు ప్రతిఫలంగా నన్ను నాలుగోసారి ప్రధానమంత్రిగా ఎన్నికయ్యేందుకు సహకరిస్తామని ఆఫర్ ఇచ్చింది. నేను దాన్ని సున్నితంగా తిరస్కరించాను. వాస్తవానికి వైమానిక స్థావరం వల్ల వారి లక్ష్యాలు వేరే ఉంటాయి. అది చాలా దూరం వెళుతుంది. ఎన్నో సమస్యలు ఎదురయ్యేందుకు అధికారణమవుతుంది. నేను భంగ బంధు రెహమాన్ కుమార్తెను. ఆ దేశాన్ని ఎవరికో అద్దెకు ఇవ్వలేను.

అప్పగించలేనని" హసీనా అప్పట్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఈస్ట్ తైమూర్ మాదిరి వాళ్లు ఇక్కడ కూడా బంగ్లాదేశ్ లోని చోటోగ్రామ్, మయన్మార్ ప్రాంతంలోని కొంత భాగాన్ని విడగొట్టి కొత్త దేశం ఏర్పాటు చేస్తారని, బంగాళాఖాతంలో ఒక స్థావరం కూడా ఏర్పాటు చేసుకుంటారని హసీనా వ్యాఖ్యానించారు. దీంతో హసీనా ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని ప్రచారం ప్రారంభమైంది. ఆమె కూడా రెహమాన్ వంటిదుస్థితిని ఎదుర్కొంటారనే వ్యాఖ్యలు వినిపించాయి.

బంగ్లాదేశ్ తయారు చేసే ఉత్పత్తులను అమెరికా ఎక్కువగా కొనుగోలు చేస్తుంది. అయితే ఆ దేశం బంగ్లాదేశ్ లో ఎన్నికలు పారదర్శకంగా జరగాలని, స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోంది.

ఇదే క్రమంలో బంగ్లాదేశ్ లోని అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, అధికారుల వీసాలపై గత ఏడాది అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

"ఎన్నికల్లో పారదర్శకత కోసం మేము చాలా ఒత్తిడి చేశాం. చాలా విధాలుగా చెప్పి చూశాం. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. వచ్చే పరిస్థితులు బంగ్లాదేశ్‌ను తీవ్రంగా ఇబ్బంది పెడతాయని" ఈ ఏడాది జనవరిలో బ్లూమ్ బెర్గ్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వాషింగ్టన్ విల్సన్ సెంటర్ సౌత్ ఏషియా ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మిషెల్ కుగ్ ల్మెన్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఆ తర్వాత రెండు నెలలకు బంగ్లాదేశ్ మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ అజీజ్ అహ్మద్ పై అమెరికా ఆంక్షలు విధించింది. మరోవైపు గత ఏడాది తమ దేశంలో జరిగే ఎన్నికల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ అమెరికా దౌత్యవేత్త పీటర్హాస్ పై బంగ్లాదేశ్ అధికార పక్షం నేతలు ఆరోపణలు చేశారు.

అయితే వీటిని ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నారని అమెరికా ఆరోపించింది. ఇవి జరిగిన కొద్ది రోజులకు బంగ్లాదేశ్లో రిజర్వేషన్ల అంశం తెరపైకి వచ్చింది. ఆ తర్వాత అది పెద్ద సంక్షోభానికి కారణమైంది. ఫలితంగా షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

మొదట్లో ఈ వ్యవహారం వెనుక చైనా ఉందని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత అమెరికా హస్తం ఉందని అనుమానిస్తున్నారు.

**- రవీంద్ర తీగల**

9
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 07, ఆగస్టు 2024

### శ్రీ కనక పుట్లమ్మ తల్లి చల్లని చూపుతో

# మంగళగిరికి మంచి రోజులు

**పెదకొండూరు శ్రీ కనక పుట్లమ్మ ఆలయంలో మంత్రి లోకేష్ పూజలు**

దుగ్గిరాల, మహానాడు:
శ్రీ కనక పుట్లమ్మ తల్లి చల్లని చూపుతో మంగళగిరి నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. దుగ్గిరాల మండలం పెద్దకొండూరులో వేంచేసి ఉన్న శ్రీ కనక పుట్లమ్మ దేవాలయంలో మంత్రి లోకేష్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం తనని కలవడానికి వచ్చిన గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి అందరితో ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో లోకేష్ మాట్లాడుతూ... అమ్మ ఆశీస్సులతో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రజా ప్రభుత్వంలో మంగళగిరి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందనుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని అన్నారు. నియోజక ప్రజల కోసం ఉండవల్లిలోని తమ ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని లోకేష్ చెప్పారు.
























జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 07, ఆగస్టు 2024



# విశ్వక్‌సేన్ 13వ చిత్ర ఎనౌన్స్‌మెంట్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తన 13వ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశారు. దసరాతో భారీ బ్లాక్‌బస్టర్ అందించిన ఎస్ఎల్‌వి సినిమాస్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. బ్యానర్ నుంచి ప్రొడక్షన్ నెం. 8గా వస్తున్న ఈ చిత్రం గ్రాండ్ ప్రొడక్షన్ వాల్యూస్ తో హై బడ్జెట్‌తో రూపొందనుంది. నూతన దర్శకుడు శ్రీధర్ గంటా రచన, దర్శకత్వం వహిస్తున్న చవిశ్వక్‌సేన్13 విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యూనిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామా. విశ్వక్ పవర్ ఫుల్ ఐపిఎస్ ఆఫీసర్ గా ప్రీ-లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఫైర్ బ్యాక్ డ్రాప్ లో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని క్రియేట్ చేసింది.
ఎవ్రీ యాక్షన్ ఫైర్స్ ఎ రియాక్షన్ అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. చవిశ్వక్‌సేన్13లో టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. తంగలాన్ ఫేమ్ కిషోర్ కుమార్ సినిమాటోగ్రఫీని నిర్వహించనుండగా, కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూర్చనున్నారు. ఈ హైలీ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ గురించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

# ఆగస్ట్ 9న "సంఘర్షణ"

మహీంద్ర పిక్చర్స్ ప్రొడక్షన్ నెంబర్ 1 మూవీ సంఘర్షణ. చిన్న వెంకటేష్ దర్శకత్వంలో వల్లూరి.శ్రీనివాస రావ్ తెలుగు, తమిళ్ భాషల్లో నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమలు పూర్తి చేసుకొని ఆగస్ట్ 9న గ్రాండ్ గా థియేటర్స్ లో విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ట్రైలర్ అత్యంత ఉత్కంఠభరితంగా ఉంది, నెక్స్ట్ ఏం జరుగుతుందో అనే ఒక క్యురియాసిటీని కలిగించే విధంగా ఉందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచే విధంగా ఉందని వార్తలు వస్తున్నాయి. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ అయినా ఇందులో లవ్, ఫ్యామిలీకి సంబందించిన అన్ని రకాల ఎమోషన్స్, ఎలిమెంట్స్ ఈ చిత్రంలో ఉండబోతున్నాయి. శివ రామచంద్రపు, చైతన్య పసుపులేటి, రషీద భాను మెయిన్ లీడ్ గా నటిస్తున్న ఈ సినిమాకు సుధాకర్ బార్టే అండ్ కేవీ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. వన్ మీడియా ద్వారా పార్థు రెడ్డి సంఘర్షణ సినిమాను థియేట్రికల్ విడుదల చేస్తున్నారు. ఆదిత్య శ్రీ రామ్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా ఉంటుందని చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ప్రేక్షకులకు నచ్చే సినిమాతో రావడం సంతోషంగా ఉందని నిర్మాత వల్లూరి.శ్రీనివాస్ రావ్ తెలిపారు.





# అందరినీ అలరించే కమిటీకుర్రోళ్ళు..


నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు యదు వంశీ దర్శకుడు. అంతా కొత్త వారితో చేస్తున్న ఈ చిత్రం ఇప్పటికీ అందరిలోనూ అంచనాలు పెంచేసింది.

ఆగస్ట్ 9న రిలీజ్ కాబోతున్న కమిటీ కుర్రోళ్ళు చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఇది వరకు రిలీజ్ చేసిన ట్రైలర్, టీజర్, సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సోమవారం నాడు ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్, అడివి శేష్, వెంకీ అట్లూరి వంటి వారు గెస్ట్‌గా విచ్చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో.. వీడియో సందేశంలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. 'మా నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు ఆగస్ట్ 9న రాబోతోంది. ఆల్రెడీ నేను ఈ చిత్రాన్ని చూశాను. చాలా బాగుంది. మా నిహారిక మల్టీటాలెంట్. మంచి చిత్రాలు నిర్మిస్తూ తన అభిరుచిని చాటుకుంటోంది. మంచి కథ, కొత్త కాన్సెప్ట్ చిత్రాలను తెలుగు ఆడియెన్స్ ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. ఈ చిత్రం గోదావరి చుట్టు పక్కల ప్రాంతాల్లో జరుగుతుంది. యదు వంశీ గారికి ఇది మొదటి చిత్రం.

అందరూ కొత్త వాళ్లు నటించారు. మంచి విజువల్స్ ఉంటాయి. అనుదీప్ సంగీతం బాగుంది. ఈ చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుంది. సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది.. సినిమా టీంకు ఆల్ ది బెస్ట్' అని అన్నారు.

# 'మిస్టర్ బచ్చన్' షూటింగ్ పూర్తి

మాస్ మహారాజా రవితేజ, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'మిస్టర్ బచ్చన్' అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. సినిమా షూట్ పూర్తి చేసుకుని ఆగస్ట్ 15న రిలీజ్ అవుతుండగా, అంచనాలను పెంచేలా ప్రమోషనల్ క్యాంపెయిన్ జరుగుతోంది. మేకర్స్ తాజాగా రవితేజ, భాగ్యశ్రీ బోర్స్ రొమాంటిక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్ లీడ్ పెయిర్ ఇంటిమిటేట్ మూమెంట్ ని ప్రజెంట్ చేస్తోంది. ఈ రొమాంటిక్ పోస్టర్ ప్రేక్షకులను చాలా ఎట్రాక్ట్ చేసింది. ట్రైలర్ లాంచ్‌కు బజ్‌ని క్రియేట్ చేసింది. ఆగస్ట్ 7న విడుదల కానున్న ట్రైలర్, రొమాంటిక్, యాక్షన్-ప్యాక్డ్ ఎలిమెంట్స్ రెండింటినీ బ్లెండ్ చేస్తూ సినిమా నెరేటివ్ పై డీప్ ఇన్ సైట్ అందజేస్తుందని భావిస్తున్నారు. టీజర్ ఇప్పటికే ఈ ఎలిమెంట్స్‌ని ప్రజెంట్ చేయగా, ట్రైలర్‌లో కథ, సినిమా రిచ్ పీరియడ్ బ్యాక్‌డ్రాప్, పాత్రల మధ్య డైనమిక్‌ని ప్రజెంట్ చేస్తోందని భావిస్తున్నారు.





## సిద్దు జొన్నలగడ్డ 'తెలుసు కదా'
# రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం

స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ టిల్లు స్క్వేర్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ సక్సెస్ తర్వాత తన నెక్స్ట్ ప్రాజెక్ట్ 'తెలుసు కదా'తో అలరించబోతున్నారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ మూవీతో డైరెక్టర్ గా డెబ్యు చేస్తున్నారు. నీరజ కోన, సిద్దు స్టార్‌డమ్‌ను దృష్టిలో ఉంచుకుని పర్ఫెక్ట్ స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. టాప్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో సినిమాలని నిర్మించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ ఈరోజు ప్రారంభమైంది. ఇది 30 రోజుల పాటు సాగే క్రూషియల్ షెడ్యూల్. ఇందులో టాకీ సీన్స్, మ్యూజిక్ నెంబర్స్ షూట్ చేస్తున్నారు. రాశీ ఖన్నా మొదటి రోజు షూటింగ్‌లో సిద్దూతో కలిసి జాయిన్ అయింది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి మరో హీరోయిన్‌గా నటిస్తుండగా, వైవా హర్ష ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. సిద్ధూ జొన్నలగడ్డ తన పాత్ర కోసం స్టైలిష్ మేకోవర్ కావడం, ఇంటెన్స్ ప్రీ-ప్రొడక్షన్ మూవీ గ్రాండ్ ప్రొడక్షన్ స్టాండర్డ్స్‌ను సూచిస్తుంది.

# డబుల్ ఇస్మార్ట్'లో బోల్డ్ అండ్ స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను

ఉస్తాద్ రామ్ పోతినేని, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ డెడ్లీ కాంబినేషన్‌లో మోస్ట్-వెయిటెడ్ పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్' సెన్సేషనల్ ప్రమోషనల్ కంటెంట్ తో నేషనల్ వైడ్ గా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ పవర్ ఫుల్ క్యారెక్టర్ చేస్తున్నారు. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ గ్రాండ్‌గా నిర్మించిన ఈ సినిమాలో రామ్ పోతినేనికి జోడీగా కావ్య థాపర్ నటించింది. డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం



రోజున తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ కావ్య థాపర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**'డబుల్ ఇస్మార్ట్' ప్రాజెక్ట్‌లోకి ఎలా వచ్చారు?**

పూరి సర్, ఛార్మి గారిని కలసి ఆడిషన్స్ ఇచ్చాను. నా ఆడిషన్ వారికి నచ్చింది. అయితే సమయంలో ఓ చిన్న యాక్సిడెంట్‌గా కారణంగా కాస్త వెయిట్ పెరిగాను. కొంచెం వెయిట్ తగ్గమని చెప్పారు. రెండు నెలలు హార్డ్ వర్క్ చేసి వెయిట్ తగ్గాను. పూరి గారు క్రియేట్ చేసిన క్యారెక్టర్‌కి ఫిట్ అయ్యాను.
-ఇంత అద్భుతమైన కాంబినేషన్ వున్న సినిమాలో వర్క్ చేయడం చాలా లక్కీగా ఫీలౌతున్నాను. రామ్ గారు, సంజయ్ దత్ లాంటి బిగ్ స్టార్ కాస్ట్ వున్న సినిమాలో నేనూ పార్ట్ కావడం చాలా హ్యాపీగా వుంది. అలాగే పూరి గారు, మణిశర్మ గారి కాంబో చాలా ఫేమస్. అలాంటి కాంబో లో వర్క్ చేయడం చాలా థ్రిల్ ఇచ్చింది.
-నాకు పూరి జగన్నాథ్ హీరోయిన్ అవ్వాలని వుండేది. ఇస్మార్ట్ శంకర్ కి ఆడిషన్ ఇచ్చాను కానీ కుదరలేదు. ఇప్పుడు డబుల్ ఫన్, ఎంటర్ టైన్మెంట్ వుండే ఈ సినిమాలో అవకాశం రావడం మరింత హ్యాపీగా వుంది. పూరి గారు గ్రేట్ డైరెక్టర్. ఆయన విజన్ చాలా అద్భుతంగా వుంటుంది. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చు కున్నాను.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలా వుండబోతోంది?**

-ఇందులో నా క్యారెక్టర్ చాలా బోల్డ్ అండ్ స్ట్రాంగ్‌గా వుంటుంది. ఏదైనా సొంతగా నేర్చుకునే అమ్మాయి. తను చాలా స్మార్ట్, అదే సమయంలో తనలో ఇన్నోసెన్స్ కూడా వుంటుంది. ఇందులో నాకు ఫైట్ సీన్స్ కూడా వున్నాయి. ఒక యాక్టర్‌గా ఎప్పటినుంచో ఇలాంటి క్యారెక్టర్ చేయాలని కొరుకున్నాను. ఈ సినిమాతో అలాంటి క్యారెక్టర్ రావడం ఆనందంగా వుంది. ఈ క్యారెక్టర్ చేస్తున్నపుడు చాలా ఎంజాయ్ చేశాను.

**రామ్‌తో డ్యాన్స్ చేయడం ఎలా అనిపించింది?**

-అదొక బెస్ట్ ఎక్స్ పీరియన్స్. సాంగ్ షూట్ లో ఫస్ట్ డే మార్నింగ్ సిక్ అయ్యాను. చాలా ఎనర్జీ, పవర్ కావాల్సిన సాంగ్ అది. సిక్ అవ్వడంతో చాలా అప్సెట్ అయ్యాను. అయినా సెట్ లోకి వచ్చాను. అయితే ఛార్మి గారు నన్ను చూసి ఇమ్మిడియట్‌గా హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. చాలా కేర్ తీసుకున్నారు. నా కారణంగా షూటింగ్ అప్సెట్ అవుతుందని చాలా బాధపడ్డాను. మూడు రోజుల తర్వాత డబుల్ ఎనర్జీతో డిస్‌చార్జ్ అయ్యాను. నా బెస్ట్ డ్యాన్స్ ఇచ్చాను. టీం అంతా చాలా సపోర్ట్ చేశారు.
-రామ్ గారు చాలా పాషనేట్ యాక్టర్, చాలా హార్డ్ వర్క్ చేస్తారు. హైలీ ఎనర్జిటిక్‌గా వుంటారు. తను అమెజింగ్ పర్సన్. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. మా కెమిస్ట్రీ ది బెస్ట్ వచ్చింది.

**సంజయ్ దత్ గారితో మీకు కాంబినేషన్ సీన్స్ వున్నాయి ?**

-వున్నాయి. ఆయనతో వర్క్ చేయడం మైండ్ బ్లోయింగ్ ఎక్స్ పీరియన్స్. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయన లెజండరీ యాక్టర్. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం డ్రీమ్ కమ్ ట్రూ లా అనిపించింది.

**పూరి గారి నుంచి ఎలాంటి విషయాలు నేర్చుకున్నారు?**

-ఓర్పుగా వుండటంతో పాటు చాలా విషయాలు ఆయన నుంచి నేర్చుకున్నాను. ఆయన విజన్ చాలా క్లియర్‌గా వుంటుంది. సెట్‌లో చాలా కూల్‌గా వుంటారు. ఆయనలో మంచి ఫిలాసఫర్ కూడా వున్నారు. జీవితం పట్ల ఆయనకి వున్న క్లారిటీ అమెజింగ్.

**ఛార్మి గారితో కలసి వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

-ఛార్మి మేడమ్ బాస్ లేడీ. నన్ను చాలా కేరింగ్ గా చూసుకున్నారు. తను పవర్ హౌస్. చాలా ఫ్రెండ్లీగా వుంటారు. హ్యాట్సప్ టు ఛార్మి గారు.

**ఇస్మార్ట్ శంకర్ పెద్ద హిట్ అయ్యింది. డబుల్ ఇస్మార్ట్ ఎలా వుండబోతోంది ?**

-డబుల్ ఇస్మార్ట్ డబుల్ బ్లాక్ బస్టర్ వుంది. ఇస్మార్ట్ శంకర్‌కి దీనికి కంపారిజన్ లేదు. కంప్లీట్ డిఫరెంట్ ఫిల్మ్. చాలా ఎంజాయ్ చేశాను. ఆగస్ట్ 15 కోసం ఎదురుచూస్తున్నాను.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144